11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 34 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల శనివారం 11 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 34 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SAT 11 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## 2047 నాటికి ఏపీ నంబర్ 1 రాష్ట్రం అవుతుంది

### నెల్లూరులో విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్టులు ప్రారంభించిన సీఎం



- రాష్ట్ర ప్రగతికి ఇవే కీలకం నెల్లూరు జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు
- పోర్టులు, ఎయిర్‌పోర్టులతో జిల్లాకు మహర్దశ అన్న చంద్రబాబు
- పర్యావరణ హిత ఇథనాల్ ప్లాంట్, గో సంరక్షణకు ప్రశంసలు
- త్వరలో దగదర్తి విమానాశ్రయం, బీపీసీఎల్ రిఫైనరీ




పెన్ పవర్ డెస్క్:పోర్టులు, విమానాశ్రయాల ఏర్పాటుతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని, ఈ ప్రగతిలో నెల్లూరు జిల్లా కీలక పాత్ర పోషించనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక ప్రగతితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర గ్రూప్ చేపట్టిన పలు ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఇథనాల్ ప్లాంట్, నంద గోకులం లైఫ్ స్కూల్, సేవ్ ద బుల్, పవర్ ఆఫ్ బుల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించి... పరిశీలించారు. నంద గోకులం లైఫ్ స్కూల్ విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."నెల్లూరు జిల్లాలో ఇప్పుడు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు.. కీలక పరిశ్రమలు వచ్చాయి. కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా అభివృద్ధికి కీలకంగా మారతాయి. దగదర్తి విమానాశ్రయం త్వరలోనే వస్తుంది. బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ, క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతున్నాయి. రాష్ట్ర ప్రగతిలో.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో నెల్లూరు జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. ఇదే సమయంలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం లేదు. సోమశిల, కండలేరు లాంటి మంచి ప్రాజెక్టులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. 150 టీఎంసీల నీళ్లు ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉంటాయి. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉంచుతాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి... పర్యావరణం బాగుండాలి**

"ఏ ప్రాజెక్టులు చేపట్టినా... రాష్ట్రానికి ఆర్థికంగా ఉపయోగపడడంతోపాటు... పర్యావరణ హితంగా ఉండాలి. ఈ దిశగానే విశ్వసముద్ర మూడు ప్రాజెక్టులు చేపట్టింది. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది.

వివరాలు 2లో..

## బిడ్డా.. ఆఫ్ఘన్ల ధైర్యాన్ని పరీక్షించొద్దు

### భారత్ గడ్డ నుంచి పాక్‌కు తాలిబన్ మంత్రి వార్నింగ్

- భారత గడ్డపై నుంచి పాకిస్థాన్ కు ఆఫ్ఘనిస్థాన్ వార్నింగ్... ఇండియాపై ప్రశంసలు
- ఆఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టామన్న తాలిబన్లు
- తమ బాటలోనే నడవాలంటూ పాకిస్థాన్‌కు ఆఫ్ఘన్ మంత్రి హితవు
- తమ ధైర్యాన్ని పరీక్షించవద్దంటూ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:భారత పర్యటనకు వచ్చిన ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ, పొరుగు దేశం

వివరాలు 2లో..

## విశాఖ ఇక మినీ ముంబై...



### ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

- రూ. 1.17 లక్షల కోట్ల భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ ఆమోదం!
- విశాఖను ముంబై తరహాలో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయం
- గూగుల్, టీసీఎస్ వంటి సంస్థల రాకతో మారనున్న విశాఖ స్వరూపం
- అమరావతిలో రూ. 212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు
- పెట్టుబడులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఉద్యోగుల డీఏ, భూ కేటాయింపుల అంశాలపై కూడా కేబినెట్‌లో చర్చ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, అభివృద్ధి ప్రస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రానికి రూ. 1.17 లక్షల కోట్ల విలువైన భారీ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసినట్టు తెలుస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతాన్ని ఇవ్వడంతో పాటు, వేలాది ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెడతాయని భావిస్తున్నారు.

**విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక**

ఈ కేబినెట్ సమావేశంలో విశాఖపట్నం

వివరాలు 2లో..

## ఎస్ఐపై మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్...

### మచిలీపట్నంలో ఉద్రిక్తత

- వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్నను అరెస్ట్ చేసిన పోలీసులు
- మాట్లాడదామని పిలిపించి అరెస్ట్ చేశారంటూ నాని మండిపాటు
- మెడికల్ కాలేజీ ధర్నా కేసులో కార్యకర్తలను వేధిస్తున్నారని ఆరోపణ
- సుబ్బన్న అరెస్ట్‌పై పోలీసులను గట్టిగా నిలదీసిన మాజీ మంత్రి



పెన్ పవర్ డెస్క్:ఓ వైసీపీ నేత అరెస్టు వ్యవహారం మచిలీ పట్నంలో రాజకీయ దుమారం రేపింది. తమ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధి,స్తున్నారంటూ మాజీ మంత్రి పేర్ని నాని స్థానిక ఎస్ఐపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో

వివరాలు 2లో..

## పిల్లలను దీపావళి పండుగ జరుపుకోనివ్వండి: సుప్రీంకోర్టుకు ఢిల్లీ-ఎన్సీఆర్ రాష్ట్రాలు

- పర్యావరణహితమైన బాణసంచాతో వారిని పండుగ జరుపుకోనివ్వాలని విజ్ఞప్తి
- రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బాణసంచా కాల్చడానికి అనుమతివ్వాలని విజ్ఞప్తి
- సుప్రీంకోర్టును కోరిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:కాలుష్య రహిత బాణసంచాతో పిల్లలు దీపావళి పండుగ జరుపుకోవడానికి అనుమతించాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పిల్లలు దీపావళి రోజున బాణసంచా కాల్చడానికి

## ఏపీ ఎఫ్ డి సి జామాయిల్ దందా విస్తరణ






**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,అక్టోబర్ 10**

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఏలూరు డివిజన్ జంగారెడ్డిగూడెం సర్కిల్ జీలుగుమిల్లి ప్లాంటేషన్ పరిధిలో లో జామాయిల్ దందా విస్తరణ ఎక్కువగా కనిపిస్తోంది. ఏ ప్లాంటేషన్లో చూసిన గాని జామాయిల్ బాదులు నరికి వేసుకొని పోయి మో డులు దర్శనమిస్తున్నాయి. బాజులు తీసుకుపోయి నరికి వేసుకొని పై చివరలు వదిలివేసి వెళుతున్నారు. 2009 ,2013 బీట్ -2 జామాయిల్ ప్లాంటేషన్లో ఎక్కువగా అక్రమ రవాణా సాగుతోంది. పొగాకు సీజన్ కావడంతో నూతన బేరన్లు కట్టుకునే వారికి జామాయిల్ బా జులు ఎంతో ముఖ్యం. ఇదే అదునుగా భావించి కొంతమంది అక్రమార్కులు నిత్యం అక్రమ బాజులు కలపను తరలించకపోతున్నారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పుల నాగరాజు, జీలుగుమిల్లి మండలం పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీను మాట్లాడుతూ జీలుగుమిల్లి ప్లాంటేషన్లలో జామాయిల్ అక్రమ రవాణా అవుతుంటే అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. జామాయిల్ అక్రమ తరలింపు పై సంబంధిత శాఖ అధికారుల పైన విచారణ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం రేంజ్ అధికారి ఎం వసంతకుమారిని వివరణ కోరగా జామాయిల్ అక్రమ రవాణాపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## డొనాల్డ్ ట్రంప్‌కి దక్కని నోబెల్ శాంతి బహుమతి

- ట్రంప్‌కు దక్కని నోబెల్ శాంతి బహుమతి... నోబెల్ కమిటీ ఏం చెప్పిందంటే..!
- వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు పురస్కారం
- యుద్ధాలు ఆపానంటూ ట్రంప్ చేసిన ప్రచారానికి దక్కని గుర్తింపు
- ప్రచారాలు కాదు, చిత్తశుద్ధే ముఖ్యమన్న నోబెల్ కమిటీ

వివరాలు 2లో..



## టెక్ ప్రపంచంలోకి రిషి సునాక్... మైక్రోసాఫ్ట్ సలహాదారుగా నియామకం

- మైక్రోసాఫ్ట్ తో పాటు ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్‌లోనూ చేరిన రిషి సునాక్
- రెండు కంపెనీల్లోనూ సీనియర్ సలహాదారుగా నియామకం
- ఈ పదవుల ద్వారా వచ్చే ఆదాయం మొత్తం ఛారిటీకేనని ప్రకటన
- ప్రపంచ వ్యూహాలు, ఆర్థిక అంశాలపై సలహాలు అందించనున్న సునాక్
- రెండేళ్లపాటు బ్రిటన్ ప్రభుత్వాన్ని లాబీయింగ్ చేయకుండా ఆంక్షలు
- ప్రస్తుతం బ్రిటన్ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్న మాజీ ప్రధాని

పెన్ పవర్ డెస్క్: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సు నాక్ తన రాజకీయ జీవితం తర్వాత కార్పొరేట్ ప్రపం చంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఆంత్రోపిక్‌లలో

వివరాలు 2లో..



## ఆరోగ్యశ్రీపై కుట్ర జరుగుతోంది...

### పాత విధానంలోనే కొనసాగించాలి



- ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందన్న షర్మిల
- ప్రైవేట్ బీమా ముసుగులో పథకాన్ని నీరుగార్చుతున్నారని విమర్శలు
- నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2700 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# వైసీపికి కొత్త వ్యూహకర్తలు

2024 ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత, జగన్ ఇప్పుడు పూర్తిగా కొత్త దిశలో ఆలోచిస్తూ, పార్టీ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ, ప్రజల మధ్య తిరిగివిశ్వాసం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దిశగా ఆయన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది.తాజా సమాచారం ప్రకారం, జగన్ తన పార్టీకి కొత్త వ్యూహకర్తనునియమించే నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఐ–ప్యాక్ బృందంలో ప్రశాంత్ కిశోర్ తో కలిసి పనిచేసిన ఒక అనుభవజ్ఞుడు ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీకి కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్నాడు. ఈ ఒప్పందం2029 ఎన్నికల వరకు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. 2019లో ప్రశాంత్ కిశోర్ సూచనలతో భారీ విజయం సాధించిన జగన్, ఇప్పుడు అదే అనుభవాన్ని మరో వ్యూహకర్త ద్వారా వినియోగించుకోవాలనిభావిస్తున్నారు.జగన్ దృష్టి ఇప్పుడు పూర్తిగా పార్టీ కేడర్ బలోపేతంపైనే ఉంది. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో ప్రత్యక్షంగా కలుసుకోవడం, నాయకుల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యంఇస్తున్నారు. ఈ కొత్త వ్యూహం కింద, ఆయన త్వరలో ప్రజల్లోకి వెళ్లే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలముందు ఎండగట్టే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పీపీపీవిధానంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై జగన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు.ఇదే సమయంలో అధికార

కూటమి కూడా తన వ్యూహాలను మరింత బలంగా మలుచుకుంటోంది. ప్రశాంత్ కిశోర్, రాబిన్ శర్మ వంటి వ్యూహకర్తలు టీడీపీ%–%జనసేన%–%బీజేపీ కూటమికి మార్గనిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. దీంతో జగన్ కొత్తవ్యూహకర్త, కూటమి వ్యూహకర్తల మధ్య ఆలోచనా పోరు ఆసక్తికరంగా మారనుంది.ఈ చర్యలన్నీ 2029 సార్వత్రిక ఎన్నికల దిశగా జగన్ తీసుకుంటున్న సన్నాహక క్రమంలో భాగంగా కనిపిస్తున్నాయి. పార్టీ పునరుత్థానం కోసం తీసుకుంటున్న ఈ వ్యూహాత్మక అడుగులు విజయవంతమైతే, రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకోవచ్చు. ప్రజల్లో తిరిగి పట్టు సాధించడం, వైఎస్ఆర్‌సీపీకి నూతన ఉత్సాహాన్నినింపడం జగన్ ప్రధాన లక్ష్యం. రాబోయే నెలల్లో ఆయన నిర్ణయాలు, కొత్త వ్యూహకర్త సూచనలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీసే అవకాశం ఉంది.మరో వైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్‌సేవలందిస్తోంది. రుషిరాజ్ సింగ్ నేతృత్వంలోని ఈ బృందం వైసీపీకి ఎన్నికల వ్యూహాన్ని.. రాజకీయ సలహాలను అందిస్తూ వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. దానివెనుక ఐప్యాక్ టీం ఫెయిల్యూర్ ఉన్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపణలు చేశారు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఐప్యాక్ టీం కు గుడ్ బై చెబుతారని ప్రచారం నడిచింది. కానీ ఇప్పటికీ ఐ ప్యాక్ టీం సేవలే కొనసాగిస్తూవస్తున్నారు. అయితే తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఐప్యాక్ బృందం నాయకత్వం మారనున్నట్లు ప్రచారం సాగుతోంది. రిషి రాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ ప్రధాన సన్నిహితుడు రానున్నట్లు టాక్‌నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో ప్రశాంత్ కిషోర్ కు విడదీయరాని బంధం. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ముంగిట వరకు వచ్చి ఆగిపోయింది. 67 సీట్లతో సరిపెట్టుకుంది. ఈ తరుణంలోజగన్మోహన్ రెడ్డి ఎన్నికల వ్యూహకర్త కోసం అన్వేషించారు. ఎన్నికల వ్యూహంలో ఆరితేరిన ప్రశాంత్ కిషోర్ ను వ్యూహకర్తగా పెట్టుకున్నారు. 2018లో పాదయాత్ర సమయంలోనే పార్టీ శ్రేణులకు స్వయంగా పరిచయంచేశారు ప్రశాంత్ కిషోర్ ను జగన్మోహన్ రెడ్డి. అది మొదలు 2019 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించే వరకు వారి జర్నీ కొనసాగింది. కానీ అకస్మాత్తుగా ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయవేత్తగామారిపోయారు ప్రశాంత్ కిషోర్. అయినా సరే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి గౌరవ సలహాలు, సూచనలు అందించారు ప్రశాంత్ కిషోర్.ప్రస్తుతం బీహార్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు ప్రశాంత్ కిషోర్. మొన్న ఆమధ్యన మంత్రి నారా లోకేష్ ఢిల్లీ వెళ్ళినప్పుడు ప్రశాంత్ కిషోర్ తో చర్చించారు. పలు అంశాలపై వారిద్దరూ మాట్లాడుకున్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్లో ఉంది. ఇటువంటి పరిస్థితుల్లోప్రశాంత్ కిషోర్ ను ఆశ్రయిస్తే.. తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నానని.. తరువాత చూద్దామంటూ దాటవేత ధోరణి చూపించినట్లు తెలుస్తోంది. అయితే రుషిరాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ వేరే వ్యక్తి పేరునుసూచించినట్లు సమాచారం. త్వరలో ఆయన ఐప్యాక్ బృందానికి సారథ్యం వహిస్తారని కూడా ప్రచారం నడుస్తోంది. దీనిపై త్వరలో క్లారిటీ రానున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# 2047 నాటికి ఏపీ నంబర్ 1 రాష్ట్రం అవుతుంది

- మొదటి పేజి తరువాయి

దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు చేస్తోంది. దీని వల్ల రైతులకు మేలు జరుగుతుంది. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ విశ్వసముద్ర యాజమాన్యం దేశ ప్రగతికి తోడ్పడుతోంది. అలాగే పశు సంపదను కాపాడేందుకు కొత్త ప్రయోగం చేయటం అభినందనీయం. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన గోవులను సంరక్షిస్తున్నారు. ఒంగోలు జాతి పశువులను సంరంక్షిచడంపై ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయడమే కాకుండా.. శాస్త్రీయ పద్దతుల్లో పునరుత్పత్తికి చింతా శశిధర్ ఫౌండేషన్ పని చేస్తోంది. 'పవర్ ఆఫ్ బుల్' అనే విధానంలో విద్యుత్పత్తి చేపట్టడం వినూత్న ప్రక్రియ. ఈ విధానం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 5 కిలోవాట్లను ఇన్ హౌస్ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్నారు. సమాజానికి తిరిగి ఇవ్వటం అనే విధానంలో భాగమే పీ4. డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు చేయూత ఇవ్వడమనేది పీ4 విధానంలో ముఖ్యమైన అంశం" అని చంద్రబాబు వివరించారు.

**భవిష్యత్తులో భారీ పెట్టుబడులు**

"విశాఖకు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నాం. రూ.88 వేల కోట్లతో ఓ దేశచరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కు అల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధం అవుతున్నారు. 2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది. ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుంది" అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదా మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

# ఆరోగ్యశ్రీపై కుట్ర జరుగుతోంది...

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం భారీ కుట్రకు పాల్పడుతోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రైవేట్ ఆరోగ్య బీమాను ప్రవేశపెట్టడం వెనుక, పేదలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా చంపేసే దురుద్దేశం దాగి ఉందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్యశ్రీని ఒక దైవవరంగా తీసుకొస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని నిర్వీర్యం చేస్తూ రాక్షసుడిలా వ్యవహరిస్తున్నారని షర్మిల విమర్శించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2,700 కోట్ల బకాయిలు పేరుకుపోవడం వల్లే, ఆయా ఆసుపత్రులు సమ్మెకు దిగాయని, నెల రోజులుగా ఓపీ సేవలు నిలిచిపోయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఇది ప్రజారోగ్యంపై ప్రభుత్వానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు దానిని కేవలం 10 శాతానికి కుదించి రూ.2.5 లక్షల ప్రైవేట్ బీమాతో సరిపెట్టడం మోసగించడమేనని షర్మిల ఆరోపించారు. "రూ.2.5 లక్షలు దాటితే మళ్లీ ఆరోగ్యశ్రీ కింద ఇస్తామనడంలో ఆంతర్యం ఏమిటి? ప్రైవేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ప్రభుత్వ పథకాన్ని బలి చేస్తున్నారా?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ.4 వేల కోట్లు కేటాయించడానికి వెనుకాడే ప్రభుత్వం, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు వేల కోట్లు ఎలా దోచిపెడుతుందని నిలదీశారు.

దేశంలో ప్రైవేట్ బీమాను అమలు చేసిన 18 రాష్ట్రాల్లో 16 రాష్ట్రాలు తిరిగి ప్రభుత్వ ట్రస్ట్ విధానానికే మళ్లాయని షర్మిల గుర్తుచేశారు. ప్రైవేట్ బీమా వల్ల ప్రజలపై భారం తప్ప ప్రయోజనం లేదని ఆ రాష్ట్రాలు గ్రహించాయని తెలిపారు. ఇంతకాలం విజయవంతంగా నడుస్తున్న ట్రస్ట్ విధానాన్ని పక్కనపెట్టి, ప్రైవేట్ బీమాను ఎందుకు తీసుకొస్తున్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ బీమాకు అనుసంధానించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ట్రస్ట్ విధానంలోనే ఆరోగ్యశ్రీని కొనసాగించాలని కోరారు. ఆసుపత్రులకు ఉన్న రూ.2700 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి, వైద్య సేవలు పునరుద్ధరింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# బిడ్డా.. ఆఫ్ఘన్ల ధైర్యాన్ని పరీక్షించొద్దు

- మొదటి పేజి తరువాయి

పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచి పెట్టామని స్పష్టం చేసిన ఆయన, శాంతి స్థాపన కోసం పాకిస్థాన్ కూడా తమ మార్గాన్ని అనుసరించాలని హితవు పలికారు. అంతేకాకుండా, కాబూల్‌పై జరిగిన వైమానిక దాడుల వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు.ఈరోజు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశమైన అనంతరం ముత్తఖీ విలేకరులతో మాట్లాడారు. "గత నాలుగేళ్లలో లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలను ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పూర్తిగా ఏరివేశాం. ప్రస్తుతం దేశంలో ఒక్క ఉగ్రవాది కూడా లేడు. అంగుళం భూమి కూడా వారి ఆధీనంలో లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి, "శాంతి కోసం మేం చేసినట్లుగానే ఇతర దేశాలు కూడా ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.కాబూల్ పేలుళ్ల గురించి మాట్లాడుతూ... "ఇలాంటి చర్యల ద్వారా సమస్యలు పరిష్కారం కావు. చర్చలకు మేం సిద్ధంగా ఉన్నాం. వాళ్ల సమస్యలను వాళ్లే పరిష్కరించుకోవాలి. 40 ఏళ్ల తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి నెలకొంది. దీనితో ఎవరికీ ఇబ్బంది ఉండకూడదు" అని ముత్తాఖీ అన్నారు. ఆఫ్ఘన్ల ధైర్యాన్ని పరీక్షించాలని ఎవరూ ప్రయత్నించవద్దని, అలా చేయాలనుకుంటే సోవియట్ యూనియన్, అమెరికా, నాటోలను అడిగి తెలుసుకోవాలని గట్టిగా హెచ్చరించారు.మరోవైపు, భారత్‌తో సంబంధాలపై ముత్తాఖీ ప్రశంసలు కురిపించారు. ఆఫ్ఘనిస్థాన్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను పునరుద్ధరించాలని భారత్ నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కాబూల్‌లోని భారత టెక్నికల్ మిషన్‌ను పూర్తిస్థాయి రాయబార కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తామని జైశంకర్ హామీ ఇచ్చారని తెలిపారు. భూకంపం సంభవించినప్పుడు మొదటగా స్పందించి ఆదుకున్నది భారతేనని గుర్తుచేసుకున్నారు. పరస్పర గౌరవం, వాణిజ్యం ఆధారంగా భారత్‌తో బలమైన స్నేహాన్ని కోరుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఎస్ఐపై మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్... మచిలీపట్నంలో ఉద్రిక్తత

- మొదటి పేజి తరువాయి

పోలీస్ స్టేషన్ వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

వివరాల్లోకి వెళితే, వైసీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్నను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అయితే, మాట్లాడదాం రమ్మని పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన తర్వాత, ఎలాంటి సమాచారం లేకుండా అదుపులోకి తీసుకున్నారంటూ పేర్ని నాని తీవ్రంగా మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, సుబ్బన్న అరెస్టుకు గల కారణాలపై ఎస్ఐను నిలదీశారు.మెడికల్ కాలేజీ వద్ద జరిగిన ఓ ధర్నా కేసుకు సంబంధించి ఈ అరెస్ట్ జరిగినట్లు తెలుస్తోంది. ఇదే కేసులో

పలువురు వైసీపీ కార్యకర్తలను రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తూ మానసికంగా వేధిస్తున్నారని పేర్ని నాని ఆరోపించారు. ఒక పద్ధతి ప్రకారం తమ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆయన పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యకర్తల అరెస్టులు, వేధింపులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం.

# విశాఖ ఇక మినీ ముంబై...

- మొదటి పేజి తరువాయి

అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విశాఖను దేశ ఆర్థిక రాజధాని ముంబై తరహాలో ఒక శక్తివంతమైన ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు విశాఖకు వస్తున్నాయని, నగరాన్ని ఒక అంతర్జాతీయ ఐటీ హబ్‌గా మార్చడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ పెట్టుబడులతో విశాఖ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

**అమరావతి నిర్మాణ పనులకు వేగం**

రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో రూ. 212 కోట్ల అంచనా వ్యయంతో నూతన రాజ్‌భవన్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. దీంతో పాటు, రాజధాని పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన నిధులలో 25% సీఆర్డీఏ (%జ=ణూ%) ద్వారా కేటాయించాలని నిర్ణయించారు. ఈ చర్యలతో రాజధాని ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన మరింత ముందుకు సాగనుంది. వీటితో పాటు పలు సంస్థలకు అవసరమైన భూ కేటాయింపులు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కరువు భత్యం (డీఏ) వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, కేవలం పెట్టుబడులకు ఆమోదం తెలపడమే కాకుండా, ఆయా సంస్థలు క్షేత్రస్థాయిలో తమ కార్యకలాపాలను వేగంగా ప్రారంభించేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల మంత్రులపై ఉందని స్పష్టం చేశారు. "రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ఎంతో కష్టపడుతున్నాం. ఈ ప్రణాళికల ఫలాలు ప్రజలకు చేరేలా, వాటి ప్రాముఖ్యతను వారికి అర్థమయ్యేలా వివరించాలి," అని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మంత్రులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు.

# డొనాల్డ్ ట్రంప్‌కి దక్కని నోబెల్ శాంతి బహుమతి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతోకాలంగా ఆశిస్తున్న నోబెల్ శాంతి బహుమతి ఈసారి కూడా ఆయనకు అందని ద్రాక్షగానే మిగిలింది. భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ చేసిన ప్రచారంతో సహా, అనేక వివాదాస్పద వాదనలతో ఈ పురస్కారం కోసం తీవ్రంగా ప్రయత్నించిన ట్రంప్‌కు నిరాశే ఎదురైంది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని వెనిజులాకు చెందిన విపక్ష నేత, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ ప్రకటించింది.నోబెల్ బహుమతి ప్రకటన అనంతరం కమిటీ ఛైర్మన్ జార్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ మాట్లాడుతూ, తమ నిర్ణయం కేవలం గ్రహీతల ధైర్యసాహసాలు, చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. "ప్రతి ఏటా మాకు వేలాది సిఫార్సు లేఖలు వస్తాయి, మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారాలు జరుగుతాయి. కానీ మా నిర్ణయాలు ఆల్ఫ్రెడ్ నోబెల్ సంకల్పానికి అనుగుణంగానే ఉంటాయి" అని ఆయన తెలిపారు. ఈ వ్యాఖ్యలు పరోక్షంగా ట్రంప్ ప్రచార సరళిని ఉద్దేశించినవేనని విశ్లేషకులు భావిస్తున్నారు. వెనిజులాలో ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న కీలకమైన, ఐక్యతా శక్తిగా మరియా కొరినాను కమిటీ ప్రశంసించింది.నోబెల్ పురస్కారం కోసం ట్రంప్, వైట్‌హౌస్ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాయి. గత నెల ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కూడా ట్రంప్ తన శాంతి యత్నాల గురించి గొప్పగా చెప్పుకున్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య మే నెలలో ఉద్రిక్తతలను తానే చల్లార్చానని ఆయన బలంగా వాదించారు. అయితే, పాకిస్థాన్ ప్రత్యక్ష అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ జరిగిందని, ఇందులో ట్రంప్ పాత్ర ఏమీ లేదని భారత్ అప్పట్లోనే తీవ్రంగా ఖండించింది.దీనితో పాటు ఇజ్రాయెల్–ఇరాన్, రువాండా–కాంగో, సెర్బియా–కొసోవో సహా మొత్తం ఏడు యుద్ధాలను తానే పరిష్కరించినట్లు ట్రంప్ చెప్పుకున్నారు. వాస్తవానికి వీటిలో కొన్ని పూర్తిస్థాయి యుద్ధాలు కాకపోగా, మరికొన్నింటిలో ఉద్రిక్తతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నోబెల్ బహుమతిపై ట్రంప్‌కు ఉన్న ఆసక్తి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు గతంలో ఈ పురస్కారం వచ్చినప్పుడు, ఏమీ చేయకుండానే ఆయనకు బహుమతి ఇచ్చారంటూ ట్రంప్ తీవ్రంగా విమర్శించిన విషయం తెలిసిందే.

# పిల్లలను దీపావళి పండుగ జరుపుకోనివ్వండి: సుప్రీంకోర్టుకు ఢిల్లీ-ఎన్సీఆర్ రాష్ట్రాలు

- మొదటి పేజి తరువాయి

ఎదురు చూస్తుంటారని తెలిపాయి. అయితే పర్యావరణహితమైన బాణసంచాతో వారిని పండుగ చేసుకోనివ్వాలని రాష్ట్రాలు కోరాయి.ఈ మేరకు ఎన్సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్ రాష్ట్రాలు – ఢిల్లీతో పాటు హర్యానా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని రాజధాని ప్రాంత జిల్లాలు) రాష్ట్రాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనాన్ని కోరారు.

ఢిల్లీ–ఎన్సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పు వెలువరించింది. అయితే దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పర్యావరణ హిత బాణసంచా కాల్చడానికి అనుమతివ్వాలని కోరారు.

కొన్ని షరతులతో ఎన్సీఆర్ పరిధిలో బాణసంచా ఉపయోగాన్ని అనుమతించవచ్చని కోర్టును కోరారు. జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ ఆమోదించిన పర్యావరణ హిత బాణసంచా మాత్రమే తయారు చేసి, విక్రయించేలా సూచించాలని తుషార్ మెహతా కోరారు. అత్యధిక పేలుడు స్వభావమున్న టపాసులు తయారు చేయకుండా రాష్ట్రాలు, ఢిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయని అన్నారు. వ్యాపారులు కూడా అనుమతి పొందిన క్రాకర్లను మాత్రమే విక్రయించేలా చూడాలని అన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

# టెక్ ప్రపంచంలోకి రిషి సునాక్... మైక్రోసాఫ్ట్ సలహాదారుగా నియామకం

- మొదటి పేజి తరువాయి

సీనియర్ సలహాదారుగా చేరినట్లు ప్రకటించారు. గత జులైలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్న సునాక్, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యునిగా కొనసాగుతున్నారు.ఈ కొత్త బాధ్యతల గురించి రిషి సునాక్ తన లింక్డ్ఇన్ పోస్టులో స్వయంగా వెల్లడించారు. ఈ రెండు పదవుల ద్వారా తనకు లభించే ఆదాయాన్ని మొత్తం తన భార్య అక్షతా మూర్తితో కలిసి ప్రారంభించిన 'ది రిచ్‌మండ్ ప్రాజెక్ట్' అనే ఛారిటీ సంస్థకు విరాళంగా ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఆంత్రోపిక్ సంస్థలో సునాక్ పాత్ర ప్రధానంగా అంతర్గత వ్యవహారాలకు, వ్యూహాత్మక సలహాలకు మాత్రమే పరిమితం కానుంది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆయన కంపెనీకి మార్గనిర్దేశం చేస్తారు. ఇక మైక్రోసాఫ్ట్‌లో కూడా ఆయన ఇదే తరహా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. త్వరలో జరగబోయే మైక్రోసాఫ్ట్ వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది.ఈ నియామకాలకు సంబంధించి బ్రిటన్‌లో మాజీ మంత్రులు, ఉన్నతాధికారుల కొత్త ఉద్యోగాలపై నిబంధనలను పర్యవేక్షించే 'అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ ( నిర్దేశించిన షరతులకు పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు ఆంత్రోపిక్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ప్రకారం, రిషి సునాక్ మంత్రి పదవి నుంచి వైదొలిగిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఈ కంపెనీల తరఫున బ్రిటన్ ప్రభుత్వాన్ని లాబీయింగ్ చేయడానికి వీల్లేదు. అలాగే, ప్రభుత్వంలో ఉన్నప్పుడు తనకు తెలిసిన రహస్య సమాచారాన్ని

ఈ పదవుల కోసం ఉపయోగించకూడదని ACOBA స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.గత జులైలో రిషి సునాక్ ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్‌లో సలహాదారుగా తిరిగి చేరిన విషయం తెలిసిందే. 2000వ దశకం ప్రారంభంలో ఆయన ఇదే సంస్థలో అనలిస్ట్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు.

# పోలీస్ సిబ్బంది సమన్వయంతో ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించండి -ఎస్పీ వకుల్ జిందాల్





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10**

ప్రతి రోజు రెండు పూటల రోల్ కాల్ నిర్వహించి, వారానికి కనీసం ఒకసారి పోలీస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించాలి. జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అధ్యక్షతన "సెప్టెంబర్ – 2025 నెలకు సంబంధించిన నేర సమీక్షా సమావేశం. నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, నాణ్యమైన సేవలందించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్పీ ముఖ్య సూచనలు...:** పోలీస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ వద్ద నైపుణ్యం కలిగిన, మర్యాదపూర్వకంగా వ్యవహరించే సిబ్బందిని నియమించి, ప్రజల ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి. పీజీఆర్స్ కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సమయానుకూలంగా, నాణ్యమైన రీతిలో పరిష్కరించాలి. మహిళల నుండి అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, ఎఫ్ఐఆర్ నమోదు చేయదగిన నేరమైతే వెంటనే నమోదు చేయాలి. 60, 90 రోజుల వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేయాల్సిన కేసులను వేగంగా పూర్తి చేసి, న్యాయస్థానంలో ప్రాథమిక ఛార్జిషీట్ సమర్పించాలి. శక్తి కాల్స్ అందిన వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకొని పరిష్కారం చూపించాలి. మహిళా పోలీసుల సహకారంతో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వారితో ప్రతీ వారానికి సమావేశాలు నిర్వహించి గ్రామాలు/వార్డుల శాంతి భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణపై సమీక్ష చేయాలి. డయల్ 100, 112 ద్వారా అందే కాల్స్‌కు వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలి. రాత్రి గస్తీ వ్యవస్థను ఏ, బి, సి, డి బృందాలుగా విభజించి, విధులు వలయాకార (క్లాక్వైస్) పద్ధతిలో అమలు చేయాలి. రాత్రి గస్తీ సిబ్బంది లాఠీలు, టార్చ్ లైట్లు, విజిల్స్ తీసుకెళ్లడం తప్పనిసరి. వాహనాలపై పోలీస్ సైరన్ అమర్చుకొని వినియోగించాలి. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి 10:30 గంటలలోపు షాపులు మూసివేయించాలి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాత్రిపూట అనుమానాస్పదంగా తిరిగే వారిని అదుపులోకి తీసుకొని సాంకేతిక పరికరాల సహాయంతో వారి వివరాలు పరిశీలించాలి. విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల పరిసరాల్లో పగటి గస్తీ కూడా కొనసాగించాలి. డ్రంక్ %ఇ% డ్రైవ్ , ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలను ప్రతిరోజూ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలి. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ గస్తీ నిర్వహించి, నిర్మానుష్య ప్రదేశాలు, గుబురు చెట్లు ఉన్న ప్రాంతాలు, విడిచిపెట్టిన భవనాలను పర్యవేక్షించి, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలి. చీకటి, జనసంచారం లేని ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ సమన్వయంతో లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయించాలి.

అర్ధరాత్రి సమయంలో రోడ్లపై అల్లర్లు సృష్టించే వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. రౌడీషీటర్లపై నిఘా ఉంచి, తరచూ నేరాలకు పాల్పడే వారిపై కొత్త రౌడీ షీట్లు ఓపెన్ చేయాలి. ఆక్రమణ తొలగింపు సమయంలో పోలీస్ సహకారం కోరినప్పుడు సంబంధిత యూనిట్ ఆఫీసర్ దృష్టికి తప్పనిసరిగా తీసుకెళ్లాలి. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను సి సి టి ఎన్ సి లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి్మ ప్రతి 15 రోజులకు ఒకసారి తనిఖీ నిర్వహించాలి. సాంకేతిక పరికరాలను వినియోగించి పరారీలో ఉన్న నేరస్తులు, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కనుగొనాలి. రానున్న దీపావళి పండుగ దృష్ట్యా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాణసంచా విక్రయ షాపులు, స్టాక్, లైసెన్సులు వంటి అంశాలను పరిశీలించి, అనుమతి లేని విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఏ.టి.వి. రవికుమార్ ( ఎల్ %ఇ% ఓ), శ్రీ ఏ. హనుమంతు ( ఏ ఆర్ ), డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్

గుంటూరు। బాపట్ల। పల్నాడు

# చిలకలూరిపేటలో డ్రైనేజీ కష్టాలు..

## వర్షానికి రోడ్లపైకి మురుగు, విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం!





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 10**

పట్టణంలో కురిసిన వర్షానికి విజయ బ్యాంక్ పక్కన రోడ్డులో తీవ్రమైన డ్రైనేజీ సమస్య తలెత్తింది. ముఖ్యంగా ఆదిత్య కంటి ఆసుపత్రి ఎదురుగా ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, నీరు పోయే మార్గం అస్తవ్యస్తంగా మారడంతో, వర్షపు నీటితో కలిసి మురుగు నీరు రోడ్డుపైకి ఉప్పొంగి పారుతోంది.

**విద్యార్థులకు, స్థానికులకు ఇబ్బందులు..**

ఈ ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో విద్యా సంస్థలు, వైద్యశాలలు ఉండటంతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పారుతున్న మురుగునీటి గుండానే విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కలుషిత నీటిలో నడవడం వల్ల అనారోగ్యాలు, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


**స్థానికుల ఆరోపణలు..**

"డ్రైనేజీని సరిగ్గా శుభ్రం చేయకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం," అని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి, మురుగునీరు పోవడానికి దారి లేక రోడ్డు మీదికి ప్రవహిస్తోందని వారు తెలిపారు. పారిశుద్ధ్య లోపం కారణంగా పట్టణ ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని చిలకలూరిపేట ప్రజలు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే సాంబన్న కృషి... పర్చూరు మండలంలో అభివృద్ధి జోరు







**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 10**

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో పర్చూరు మండలం అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. మండల పరిధిలో ఆయా గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.18 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి161 పనులకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతలో రూ.6.25 కోట్లతో 67 పనులు మంజూరయ్యాయి. అలాగే రెండో విడతలో రూ. 11.75 కోట్ల వ్యయంతో 94 పనులు మంజూరయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. గ్రామాల వారిగా వివరాలు ఇలా... ఉప్పుటూరు గ్రామంలో మొత్తం రూ.80 లక్షల వ్యయంతో 10 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.15 లక్షల నిధులతో 3 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.65 లక్షలతో 7 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. వీరన్నపాలెం గ్రామంలో మొత్తం రూ.1.13 కోట్ల వ్యయంతో 12 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.49.8 లక్షలకు గాను 6 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.64 లక్షలతో, 6 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు చేపట్టాల్సి ఉంది. పోతుకట్ల గ్రామంలో మొత్తం రూ.70 లక్షల నిధులతో 11 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.30 లక్షల నిధులతో గాను 5 పనులు పూర్తి బాగా మరొక, వర్క్ పూర్తి కావలసి ఉంది.రెండో విడతలో రూ.40 లక్షల రూపాయలతో, 5 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. చెరుకూరు గ్రామంలో మొత్తం రూ.1.50కోట్ల నిధులతో 11 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.45 లక్షల నిధులతో 6 పనులు పూర్తి అయ్యాయి.రెండో విడతలో రూ.80 లక్షల వ్యయ్యంతో, 5 వర్క్ లు మంజూరు అయ్యాయి. పంచాయతీలోని ఏటిఒడ్డు ఉప్పరపాలెంకి రూ.10 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ కి ,కొత్తపాలెం గ్రామానికి రూ.15 లక్షల వ్యయ్యంతో, 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. భూషయాపాలెం గ్రామంలో మొత్తం రూ.30 లక్షల నిధులతో 4 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.10 లక్షల నిధులతో 3 పనులు పూర్తి అయ్యాయి.రెండో విడతలో రూ.20 లక్షలతో 1వర్క్ కి నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. గొల్లపూడిలో మొత్తం రూ.30 లక్షల నిధులతో 4 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రెండు వర్కులకు రూ.10 లక్షలు మంజూరు కాగా 1 వర్క్ పూర్తయింది. మరొక వర్క్ పూర్తి కావలసి ఉంది. రెండో విడతలో రూ.20 లక్షల వ్యయ్యంతో, 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. చిన్ననందిపాడు గ్రామంలో మొత్తం రూ.30 లక్షల నిధులతో 2 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.10 లక్షల నిధులతో 1 పని పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.20 లక్షలతో, 1వర్క్ కి నిధులు మంజూరు అయ్యాయి. పనులు చేపట్టాల్సింది అన్నంబోట్లవారి పాలెం గ్రామంలో మొత్తం రూ.60 లక్షల వ్యయ్యంతో 10 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.20 లక్షల వ్యయ్యంతో 5 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.40 లక్షలతో, 5 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. గర్నెపూడి గ్రామంలో మొత్తం రూ.25 లక్షల వ్యయ్యంతో 2 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.5 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.20 లక్షలతో 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి. ఏడారిపల్లి గ్రామానికి రూ.66 లక్షల వ్యయ్యంతో, 9 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది.

గోరంట్లవారిపాలెం గ్రామానికి రూ.10 లక్షల వ్యయ్యంతో, 1 వర్క్ కి నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. తిమ్మరాజుపాలెం గ్రామంలో మొత్తం రూ.75 లక్షల వ్యయ్యంతో 5 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.45 లక్షల వ్యయ్యంతో 3 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.30 లక్షలతో, 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. నూతలపాడు గ్రామంలో మొత్తం రూ.కోటి 25 లక్షల నిధులతో 17 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.45 లక్షల వ్యయ్యంతో 8 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.80 లక్షలతో, 9 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. అలాగే కుర్రపాలెం రూ.10 లక్షల వ్యయ్యంతో, 1 వర్క్ కి నిధులు మంజూరు అయ్యింది. ఈ పనులు ప్రారంభించాల్సింది. కొల్లవారిపాలెం గ్రామంలో మొత్తం రూ.25 లక్షల వ్యయ్యంతో 2 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.5 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.20 లక్షలతో, 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి. నాగులపాలెం గ్రామంలో మొత్తం రూ.1.50 కోట్ల నిధులతో 10 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.కోటి నిధులతో 4 పనులు పూర్తి కాగా మరొక 3వర్క్ లు పురోగతిలో ఉన్నాయి.రెండో విడతలో రూ.50 లక్షల నిధులతో, 3 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. దేవరపల్లి గ్రామంలో మొత్తం రూ. కోటి నిధులతో 4 వర్క్ లు మంజూరు అయ్యాయి.ఇందులో మొదటి విడతలో రూ.50 లక్షల వ్యయ్యంతో 2 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.50 లక్షలతో, 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు చేపట్టాల్సింది. పర్చూరు గ్రామంలో మొత్తం రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో 22 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో కోటి రూపాయల వ్యయ్యంతో 8 పనులు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.కోటి 50 లక్షలతో, 14 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. బోడవాడ గ్రామంలో మొత్తం రూ.40 లక్షల వ్యయ్యంతో 3 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.10 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.30 లక్షలతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అడుసుమల్లి గ్రామంలో మొత్తం రూ.1.90 కోట్ల వ్యయ్యంతో 4 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.10 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.30 లక్షలతో, 3 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. అలాగే మూడో విడతలో 3 పనులకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇనగల్లు గ్రామంలో మొత్తం రూ.55 లక్షల వ్యయ్యంతో 2 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.35 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.20 లక్షలతో, 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు చేపట్టాల్సింది కొమర్నెనివారిపాలెం గ్రామంలో మొత్తం రూ.20 లక్షల వ్యయ్యంతో 2 వర్క్ లు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.10 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.10 లక్షలతో 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. తన్నీరువారిపాలెం గ్రామంలో మొత్తం రూ.20 లక్షల వ్యయ్యంతో 1 వర్క్ కి నిధులు మంజూరు అయ్యాయి ఈ పనులు పూర్తయ్యాయి. రమణయపాలెం గ్రామానికి రూ.15 లక్షల వ్యయ్యంతో, 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. చెన్నుంబోట్లవారిపాలెం గ్రామానికి రూ.20 లక్షల వ్యయ్యంతో, 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. ఏదుబాడు గ్రామానికి రూ.30 లక్షల వ్యయ్యంతో, 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. పెద్దివారిపాలెం గ్రామానికి రూ.20 లక్షల వ్యయ్యంతో, 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది.

## జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి..





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10.**

గుంటూరు ఏ.సి. కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సహచర ప్రజానిధులు, అధికారులతో కలసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ లో గుంటూరుకు చెందిన పలు హోమ్ అప్లయెన్సెస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్టైల్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అధికారులు జీఎస్టీ 2.0లోని కొత్త నిబంధనలు, వినియోగదారుల రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక మైలురాయి. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు ఇవి నిజమైన వరంగా నిలుస్తున్నాయి. అవసరమైన ఉత్పత్తులపై పన్నులు తగ్గించడంతో వినియోగదారులు నేరుగా లాభపడుతున్నారు. తక్కువ పన్నులతో అందుబాటులోకి వస్తున్న వస్తువులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామిగా మారాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. జీఎస్టీ అమలు వల్ల పారదర్శకత పెరిగిందని, వ్యాపార రంగంలో విశ్వాసం నెలకొన్నదని. "ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయి. ప్రతి కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తెలుసుకొని ఉపయోగించుకోవాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# ప్రజా సేవే లక్ష్యం అభివృద్ధే దిశా నిర్దేశం

**నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు**





**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 10**

నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు నరసరావుపేట ఆర్యవైశ్య ప్రముఖులు నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపిలవాయి విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో నవంబర్ నెలలో విజయవాడలో జరగబోయే బంగారు ఆభరణాల ప్రదర్శన పోస్టర్‌ను ముఖ్యమంత్రితో ఆవిష్కరించారు. ఈ ప్రదర్శన ద్వారా ఆభరణాల వ్యాపారులకు, చిన్నతరహా వ్యాపారులకు అవకాశాలు పెరుగుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఉత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే వివరించారు. తదుపరి నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, మౌలిక వసతుల విస్తరణ, రోడ్లు, నీటి సదుపాయాలు, గృహ నిర్మాణ పనులు వంటి అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రాధాన్యతను వివరించి, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను వేగంగా అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు.

# పేర్ని నానిపై కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సీరియస్..

**ఆర్ పేట సీఐపై పేర్ని నాని వ్యవహరించిన తీరుపై ఆగ్రహం**

**సీఐ విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించిన పేర్ని నానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..**





**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 10:**

ఇటీవల మెడికల్ కాలేజ్ వద్ద జరిగిన నిరసన కేసులో కొంత మందికి నోటీసులు ఇచ్చి విచారిస్తున్నాం - ఎస్పీ అందులో భాగంగా 8గా ఉన్న మేకల సుబ్బన్న అనే వ్యక్తిని కూడా స్టేషన్ కు పిలిపించి విచారిస్తున్నాం.. సుబ్బన్నను విచారిస్తున్న సమయంలో పేర్ని నాని గ్రూపుగా పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఛాంబర్ లోకి వచ్చి విచారణ అధికారి అయిన సీఐని బెదిరించేలా పేర్ని నాని మాట్లాడారు. దీన్ని జిల్లా పోలీస్ శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఐ విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదు. పోలీస్ స్టేషన్ కు రావడం తప్పులేదు - ఎస్పీ. ఎవరైనా పోలీస్ స్టేషన్ కు వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చు.. అంతేగానీ విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తిని విడిపించుకుని వెళ్లిపోతా అనడం సరికాదు. పోలీసులతో మాట్లాడేటప్పుడు గౌరవంగా మాట్లాడాలి. మేం కూడా అదే గౌరవంతో మాట్లాడుతాం. గ్రూపులుగా వచ్చి గలాటా సృష్టించడం సరైన పద్ధతి కాదు. దీనిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# పొరపాట్లకు తావు లేకుండా ధాన్యం సేకరణ

**గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీలు కొరత ఉండకూడదు..**

**రైతుకు పూర్తి మద్దతు ధర అందించడమే లక్ష్యంగా పని చేయాలి**

**ధాన్యం సేకరణపై అవగాహన శిక్షణ సదస్సులో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**





**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబరు 10**

ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జిల్లాలో ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో బందరు డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు (విఏఏ), సాంకేతిక సహాయకులకు (టిఏ) ఖరీఫ్ సీజన్ 2025-26 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ధాన్యం సేకరణపై అవగాహన శిక్షణ సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుకు పూర్తి మద్దతు ధర అందించడంలో అధికారులు, సిబ్బంది క్రియాశీలకంగా పని చేయాలన్నారు. గత సంవత్సర ధాన్యం సేకరణలోని లోటుపాట్లను గుర్తించి అవి పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీల కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక కలిగి ఉండాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి తమ పంటకు పూర్తి మద్దతు ధర పొందే విధంగా ఆయా అంశాల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం వేళల్లో మంచు ఆరక మునుపు, అదేవిధంగా రాత్రి వేళల్లో వరి కోత యంత్రాలతో కోత కోయకుండా చూడడం ద్వారా తేమ శాతాన్ని తగ్గించవచ్చని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా రైతు సేవ కేంద్రాల (ఆర్ ఎస్ కె) పరిధిలో రోజుకు ఎంత మొత్తంలో ధాన్యం రావచ్చనే విషయంపై విఏఏలు అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని, కోత కోసే విషయాన్ని ఆర్ ఎస్ కె లో ముందుగానే తెలియపరిచే విధంగా రైతులకు గ్రామ సభల ద్వారా అవగాహన పరచాలని సూచించారు. తద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ఏర్పడే గందరగోళాన్ని నిరోధించవచ్చన్నారు. విఏఏల ప్రమేయం లేకుండా రైతు నేరుగా ధాన్యాన్ని మిల్లుకు తోలితే ట్రక్ షీట్ ఉత్పత్తి (జనరేట్) కాదని, దీనితో మిల్లులు వద్ద ధాన్యం అన్లోడ్ కాక రైతులు ఇబ్బందులు పడతారని, ఈ విషయాన్ని రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించి చెప్పాలన్నారు. ఆర్ ఎస్ కె ల నుంచి మిల్లులకు చేరే ధాన్యంలో తేమ శాతంలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని చెబుతూ, రెండు చోట్ల ఒకే కంపెనీకి చెందిన తేమశాతం కొలిచే యంత్రాలు ఉండాలని సూచించారు. తేమ శాతాన్ని నిర్ధారించడంలో సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ధాన్యం సేకరణ సమయంలో రైతులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. వారికున్న సమస్యలను ఓపిగ్గా ఆలకించి పరిష్కరించాలని, వారికి పూర్తి మద్దతు ధర అందించడంలో సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో బందరు ఆర్డిఓ కే స్వాతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి శివరాం ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్ పద్మావతి, సహకార శాఖ జిల్లా అధికారి కే చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సప్తశక్తి సంగం (మహిళా సమ్మేళనములు)



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10.**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా భారతి అఖిలభారతీయ శిక్షా సంస్థాన్ ఇచ్చిన పిలుపుమేరకు ఒక కోటి మంది మాతృమూర్తులను కలపాలని ఉద్దేశ్యంతో సప్తశక్తి సంగం పేరుతో 2025 అక్టోబర్ 5వ తేదీ నుండి 2026 జనవరి 23 వరకు విద్యా భారతి నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరడమైనది. ఇందులో భాగంగా విద్యా భారతి ఆంధ్ర ప్రదేశ్, మన ప్రాంతాల్లో కూడా 450 సప్తశక్తి సంగమాలు నిర్వహణ చేస్తూ సుమారు ఒక లక్ష 50 వేల మంది మాతృమూర్తులను కలపాలని ప్రయత్నం చేస్తున్నది. ఈసందర్భంగా గుంటూరు బ్రాడీపేట లోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో నిర్వహించబడిన ప్రెస్ మీట్ లో సప్తశక్తి సంగం కరదీపికను మరియు కరపత్రమును విడుదల చేయడమైనది. ఈకార్యక్రమంలో డాక్టర్ రాధాబాయి విశ్రాంత ప్రిన్సిపల్ టి.జె.పిఎస్ కళాశాల గుంటూరు, సప్తశక్తి సంగం ప్రాంత ప్రముఖ్ ఈ కార్యక్రమం యొక్క ఆవశ్యకతను ఈ విధంగా తెలియపరిచినారు. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు వచించినట్లు మహిళలలో సప్తశక్తులు ఇమిడి ఉన్నాయి.అవి కీర్తిః శ్రీ వాక్చనారీణామ్ స్మృతిర్మేధా ధృతిః క్షమా అనే వాక్యాన్ని ప్రేరణగా తీసుకొని సప్తశక్తి సంగం అనే పేరుతో ఈ సమ్మేళనాలను నిర్వహిస్తున్నాము. భారతీయ స్త్రీ కేవలం ఒక వ్యక్తి కాదు. కుటుంబానికి పునాది. సమాజానికి ప్రేరణ. దేశానికి ఆత్మ అయిన పూర్తి చైతన్య స్వరూపం. భారతీయ సంస్కృతిలో స్త్రీలను శక్తి, కరుణ, ప్రేమ, అంకితభావం మరియు త్యాగం యొక్క స్వరూపులుగా భావిస్తారు. ఆమె కుటుంబ గౌరవాన్ని కాపాడుతుంది. సమాజాన్ని నిర్మించడంలో మార్గదర్శకురాలు. కర్తవ్యాలను నిర్వహించడంలో అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శిస్తుంది. ఆమెలోని నిస్వార్థ సేవ మరియు సహజజ్ఞానం సంక్షోభ సమయాల్లో కుటుంబం, సమాజం, మరియు దేశానికి మాత్రమే కాకుండా మొత్తం మానవాళికి దిశా నిర్దేశం చేస్తాయి. ఈ కార్యక్రమంలో మహిళలందరికీ పంచ పరివర్తన బోధ చేయడం జరుగుతుంది. ఈ పంచ పరివర్తనలో కుటుంబ ప్రబోధనం, పర్యావరణం, సమరసత, స్వభావన మరియు పౌర విధులు (నాగరిక బాధ్యత)గురించి అవగాహన, ప్రేరణ కలిగించి సప్తశక్తి సంగం ద్వారా కుటుంబంలో మరియు సమాజంలో ఆచరణలోనికి తీసుకురావడానికి కృషి చేస్తాం. ఉమ్మడి కుటుంబాలు, సామూహిక జీవనం, ప్రకృతికి అనుగుణంగా ఆహారం మరియు ప్రవర్తన, సంప్రదాయాలు, పండుగలు, పర్యావరణం పట్ల ఆచరణాత్మక ప్రవర్తన మొదలైనవి ప్రపంచ శాంతికి దోహదపడే అనేక అంశాలు భారతీయ మహిళలు వీటన్నింటికీ పునాది. వారు ఈ పనిని తమ బాధ్యతగా మాత్రమే కాక ధర్మంగా భావిస్తారు. విద్యా భారతి అనుబంధ పాఠశాలలు కళాశాలల మాధ్యమంగా ఈ మహిళా సమ్మేళనాలు అక్టోబర్ 5 నుండి జనవరి 23 లోపు (రాణి దుర్గావతి జయంతి నుండి నేతాజీ జయంతివరకు) నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా 15వేల సప్తశక్తి సంగం కార్యక్రమాల యోజన చేయబడింది. 75 లక్షల మంది మహిళల భాగస్వామ్యం దీనిలో ఉంటుంది. పదివేల మంది మహిళా కార్యకర్తలు, 800 మంది సుశిక్షితులైన మహిళా వక్తలు తయారు అవుతారు. 50 లక్షల కరపత్రాలు సమాజంలో పంచబడతాయి. భారతీయ ఆలోచన ఇంటింటికి చేరవేయబడుతుంది. ఈ ప్రభావంతో 3.5 కోట్ల కుటుంబాలతో సంపర్కం ఏర్పడుతుంది. సిద్ధాంతం గురించిన అవగాహన కలుగుతుంది. స్వదేశీ వస్తువుల ఉత్పత్తి మరియు విక్రయం పెరుగుతుంది. పర్యావరణ హితమైన జీవితం పట్ల సమాజానికి రుచి పెరుగుతుంది. మహిళల మనస్సులో సకారాత్మకమైన భారతీయ ఆలోచన స్థాపించ బడుతుంది. ఈ ఉద్దేశంతో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ శతాబ్ది సంవత్సరంలో ఈ కార్యక్రమాలు యోజన చేయబడ్డాయి. మహిళల చేత మహిళల కొరకు ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. మన ఆంధ్రప్రదేశ్ లో విద్యా భారతి అనుబంధంగా 8 సమితుల ఆధ్వర్యంలో పాఠశాలలు కళాశాలలు కలిపి 182 ఉన్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలు, సంస్కార కేంద్రాలు కలిపి 430 ఉన్నాయి. గుంటూరు విభాగంలో 14 పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాల మరియు సమాజ కేంద్రంగా 25 మహిళా సమ్మేళనాలు జరుగుతాయి. ఈ సమ్మేళనాలలో వందలాది మంది మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాము. ఈసందర్భంగా నాగలక్ష్మి అడ్వకేట్, అపర్ణ ఇంజనీర్ సప్తశక్తి సంగం కరదీపికను, కరపత్రమును విడుదల చేశారు. బెహరా గాయత్రి వందన సమర్పణ గావించారు.

## పేటలో బాణసంచా షాపుల్లో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి!

**అమ్మే ధరలపై అధికారులు చర్యలు తీసుకోండి**

**నిబంధనల ప్రకారం షాపులు ఉన్నాయా!?**

**అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్**



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 10:**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ప్రతి సంవత్సరం ఎక్కడో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ కోరారు. ప్రభుత్వం కోనసీమ జిల్లాలో జరిగిన ప్రమాదంపై కమిటీని వేయడమే కాకుండా నివేదిక ఆధారంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భాను ప్రసాద్ కోరారు. చిలకలూరిపేట పట్టణంలో నేషనల్ హైవే పై ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయ కేంద్రాలలో భద్రతా నిబంధనలు అమలు జరిగేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. చిలకలూరిపేట పట్టణం బాణసంచా విక్రయాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి.. ఇక్కడ పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతాయనేది జగమెరిగిన సత్యం, బాణసంచా విక్రయదారులు తీసుకునే లైసెన్సులు, అమ్మే సరుకుకు వాటి రేట్లకు ఏమాత్రం పొంతన ఉండటం లేదని సంబంధిత అధికారులు స్పందించి రేట్ల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రతి ఇంటికి సర్వే - ప్రతి భవనానికి పన్ను

**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 10**

నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో ప్రాపర్టీ పన్నుకు సంబంధించిన అన్ అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ భవనాలను గుర్తించి పన్ను విధించుటకు జరుగుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమం పై, అలాగే ప్రాపర్టీ పన్ను మరియు నీటి చార్జీలు వసూళ్ల పురోగతిపై శుక్రవారం ఉదయం పది గంటలకు మున్సిపల్ బంగ్లాలోని వీడియో సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాంతీయ సంచాలకుడు పురపరిపాలన శాఖ హరికృష్ణ సమీక్ష నిర్వహించి, ఇంటింటి సర్వేను వేగంగా పూర్తి చేసి పన్ను లేని భవనాలకు తక్షణమే పన్ను విధించాలని సూచించారు. అదేవిధంగా ప్రాపర్టీ పన్ను, నీటి చార్జీల బకాయిలను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తిగా వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ యం. జస్వంత్ రావు, ఆదాయ అధికారి శ్రీనివాసరావు, ఆదాయ ఇన్స్పెక్టర్లు బెయిలిబాబు, సయ్యద్ జహంగీర్, వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు మరియు ఆదాయ సిబ్బంది పాల్గొన్నారు.





**మెగా డీఎస్సీ - 2025లో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు పామర్రులోని ప్రతిభ కాలేజీలో నిర్వహించిన రెసిడెన్షియల్ ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమంలో మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పాల్గొన్నారు**





**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 10**

ఎన్నో సంవత్సరాలు కట్టబడి చదివి ఈ స్థాయికి చేరుకున్న ప్రతి ఉపాధ్యాయునికి శుభాకాంక్షలు. మన రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించిన విధానం అన్ని రాష్ట్రాలకు ఆదర్శప్రాయం - ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించాం. 16వేల మంది ఉపాధ్యాయ పోస్టుల్ని ఒకేసారి నియమించడం అభినందనీయం. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సుమారు 2 లక్షల మంది ఉపాధ్యాయుల్ని చంద్రబాబు గారే నియమించారు. గతంలో బదిలీల కోసం అనేక అవస్థలు పడేవారు. చంద్రబాబుగారు వచ్చాకే పారదర్శకంగా బదిలీల విధానాన్ని తీసుకొచ్చారు. గత ఐదేళ్లు విద్యా వ్యవస్థను జగన్ రెడ్డి నాశనం చేశారు. ఎయిడెడ్ ఆస్తుల కోసం విద్యా వ్యవస్థను నాశనం చేయాలని ప్రయత్నించారు. టీచర్లను మద్యం షాపు ముందు కాపలా పెట్టి అవమానించారు. రాష్ట్రంలో ఇన్ని ఇంజనీరింగ్ కాలేజీలు రావడానికి చంద్రబాబే కారణం. ప్రపంచంలో ప్రఖ్యాత కంపెనీల్లో మన తెలుగు వారు ఈ స్థాయిలో రాణించడానికి కారణం చంద్రబాబే. మన రాష్ట్ర ప్రగతిని ప్రపంచ వ్యాప్తం చేసిన వ్యక్తి చంద్రబాబు గారే. విజన్ 2020 ప్రకటించినపుడు కంప్యూటర్లు కూడు పెడతాయా అన్నారు. కానీ నాటి విజన్ నేడు అనుభవిస్తున్నాం. క్వాంటం కంప్యూటింగ్ ఏర్పాటుకు చర్యలు చంద్రబాబు దార్శనితకు నిదర్శనం. మెడ్ టెక్ జోన్, జీనోమ్ వ్యాలీతో ప్రపంచానికి మెడికల్ కిట్లు సరఫరా చేస్తున్నాం. మెడికల్ కాలేజీల గురించి మాట్లాడే జగన్ రెడ్డి.. ఎన్ని కాలేజీలు పూర్తి చేశారో సమాధానం చెప్పాలి. కేంద్రం ఇచ్చిన నిధులను తన ఖాతాలో వేసుకుని దగా చేస్తున్నాడు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు పూర్తి చేసి పేదలకు మెరుగైన వైద్య విద్య అందించడం కోసం కృషి చేస్తున్నాం. పీపీపీ విధానాన్ని రాజకీయం చేయడం దుర్మార్గం ఒకప్పుడు పోర్టులు, రోడ్లు అన్నీ పీపీపీ విధానంలో నిర్మించినవే. రాష్ట్రానికి వచ్చే ప్రతి రూపాయి ప్రజలకు అందించడం మా లక్ష్యం. రాష్ట్రాన్ని 2047 నాటికి దేశంలోనే అగ్రస్థాయిలో నిలపాలని ప్రయత్నిస్తున్నాం. పిల్లల జీవితాలను తీర్చిదిద్దే మహోన్నత బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు.

# ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యం

## - ప్రతి ఇంటికి సదుపాయమే సంకల్పం

## నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 10**

నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కలిసి నరసరావుపేట పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం నాడు పరిశీలించారు. మొదటగా కేశనపల్లి రోడ్డులో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ నాణ్యత, మౌలిక వసతుల ఏర్పాటు, నీటి, విద్యుత్ సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపి, పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలన్నారు. ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇల్లు ప్రమాణాలకు అనుగుణంగా పూర్తవ్వాలని సూచించారు. తరువాత వినుకొండ రోడ్డులోని ఎన్టీఆర్ కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మరియు కలెక్టర్ కృతికా శుక్లా స్థానిక సమస్యలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. కాలనీ లోపల రోడ్లు, నీటి సరఫరా, కాలువల సమస్యలపై తక్షణమే సమీక్ష చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి, కూటమి నాయకులు, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, నాగసరపు సుబ్బరాయ గుప్తా, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, మున్సిపల్ అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడలలో ప్రతిభాకనబరచిన గణపవరం హైస్కూల్ విద్యార్థులు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 10**

కర్లపాలెం మండలం గణపవరం హైస్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఎస్జీయఫ్ డివిజన్ స్థాయి స్కూలు పోటీలు జడ్పి స్కూల్ ఉల్లిపాలెం నందు కబడ్డీ, చెస్ ఆటల పోటీలు నిర్వ హించబడ్డాయి. అండర్-17 చేస్ విభాగంలో నాగజ్యోతి 10 వ తరగతి జిల్లా స్థాయికి ఎంపిక అయింది. జడ్పి హైస్కూల్ ఐలవరంలో జరిగిన యోగా పోటీలలో అండర్-14 లో ఏ.జగన్ మోహన్ రెడ్డి 7వ తరగతి, ఏ.కళ్యాణి 8 వతరగతి అండర్-17 బాలురులో ఎం. విజయకార్తక్, తనూజ్ రెడ్డి సి హెచ్ రూపేష్ కుమార్ బాలికల విభాగంలో బాలకృష్ణ వేణి , వి.భవిష్య వీరంతాఎంపిక అయ్యారు. అదే విధంగా జిల్లా స్టాయికి,అదే విధంగా బీచ్ వాలీ బాల్ కు సి హెచ్ రిచర్డ్ సన్ రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యాడు. వీరందరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీనివా సరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఊపాధ్యాయులు అభినదించారు.

## చీరాల క్లాక్ టవర్ పునర్నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు ముందడుగు

**చీరాల,పెన్ పవర్,అక్టోబర్ 10**

చీరాలలో చారిత్రాత్మక క్లాక్ టవర్ పునర్నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం రూ.30 లక్షల రూపాయల నిధులు సమకూర్చి, పనుల ప్రణాళికను సిద్ధం చేశారు.ప్రాజెక్టుకు అన్ని పార్టీల కౌన్సిలర్ల మద్దతు అవసరమని భావించిన చైర్మన్, వారితో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. గురువారం వైసీపీ కౌన్సిలర్లతో సమావేశమైన ఆయన, శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పునర్నిర్మాణ ప్రణాళిక వివరాలను తెలియజేస్తూ, ప్రజా ప్రయోజనార్థం ప్రాజెక్టుకు సహకరించాలని కోరారు.



## మత్తు మందుల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన:సీఐ రమేష్

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 10:**

చిలకలూరిపేట : యువతను మత్తు మందుల బారి నుండి రక్షించాలనే లక్ష్యంతో చిలకలూరిపేట పట్టణంలో విస్తృత అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక శారదా స్కూల్ నందు చిలకలూరిపేట పట్టణ సీఐ రమేష్ సారథ్యంలో, అసిస్ట్ సంస్థ సహకారంతో "మత్తు మందు నుండి యువతను కాపాడుదాం" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రమేష్ విద్యార్థులతో మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నేటి సమాజంలో, ముఖ్యంగా ధనిక కుటుంబాలలో, "క్లబ్ కల్చర్" పేరుతో యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ తీసుకోవడం కేవలం వ్యక్తిగత సమస్యే కాదని, అది వారి కుటుంబాలను, సమాజాన్ని కూడా నాశనం చేస్తుందని స్పష్టం చేశారు.డ్రగ్స్ నివారణకు ప్రత్యేక చర్యలుడ్రగ్స్ నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని సీఐ రమేష్ తెలిపారు. డ్రగ్స్ నిరోధక చర్యల కోసం 'ఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యార్థులకు తెలియజేశారు.డ్రగ్స్ తీసుకునేవారు ఎక్కడైనా కనిపించినా,



డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ను గుర్తు చేశారు. ఎవరైనా డ్రగ్స్ కనిపిస్తే, ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లయితే వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో శారదా స్కూల్‌కు చెందిన బాలురు, బాలికలు సంఖ్యలో పాల్గొన్నారు.

## జీఎస్టీ అవగాహన - ఆర్థిక అభివృద్ధికి పునాది

### సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 10**

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు వేర్వేరు చోట్ల పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. అనంతరం ముందుగా సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో పూరవారి విందు ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళలకు సూపర్ జీఎస్టీ యొక్క ప్రాముఖ్యతను వివరించి, వస్తువులు మరియు సేవల పన్ను గురించి పూర్తి అవగాహన కల్పించారు. తరువాత నరసరావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రదర్శన మరియు విక్రయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీఎస్టీ విధానం, దాని ప్రయోజనాలు, ప్రజల దైనందిన జీవితంలో దాని పాత్రపై వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ శాఖ అధికారులు, ప్రధాన పన్ను అధికారి,



ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు టీడీపీ కార్యకర్తలు, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ పవర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం. అడపా మాణిక్యాలరావు..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10.**

గతంలో 4శ్లాబుల్లో జీఎస్టీ ఉండగా ఇప్పుడు వాటిని రెండే శ్లాబులకు కుదించారు. దీంతోపాటే పేద, మధ్య తరగతి ప్రజలకు అవసరమైన వస్తువులపై 18, 12 శాతం పన్నును ఏకంగా 5 శాతానికి తగ్గించారు అలాగే కొన్ని వస్తువులపై పన్నును సున్నా చేసింది కేంద్రం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు. అడపా మాణిక్యాలరావు. కార్యదర్శి.నక్కల వంశీకృష్ణ యాదవ్, 31 డివిజన్ అధ్యక్షులు మధులాల్, 84 వ సచివాలయ సిబ్బందితో కలిసి వ్యాపార సంస్థలకు ఈ బ్రోచర్లు అందజేయడం జరిగింది.

## ఘణంగా అంతర్జాతీయ బాలికల దీనోత్సవం



**చిన్నగంజాం,పెన్ పవర్,అక్టోబర్ 10**

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని జేడ్పి హైస్కూలు అడవీదిపాలెం మరియు కెజివిబి చిన్నగంజాం నందు మహిళా-శిశు సంక్షేమ శాఖ సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఇ సందర్భంగా బాలికలకు సైబర్ క్రైమ్,లింగ సమనత్వం,బాల్య వివాహలు,బాలికలకు పౌష్టికాహారం, విద్య ప్రాముఖ్యత గురించి, వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో బాగంగా వ్యాసరచన,డ్రాయింగ్ పోటిలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇ కార్యక్రమంలో కెజివిబి ప్రిన్సిపాల్ సుమంజిలి, సూపర్వైజర్ ఎన్.సుమలత, టీచర్ అశాజ్యోతి,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి సీఎం చంద్రబాబు నాయుడుకు విన్నవించిన.. ఎమ్మెల్యే నసీర్..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10**

బడుగు, బలహీన వర్గాలు అత్యధికంగా ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ విన్నవించారు. గురువారం వెలగపూడిలో సీఎం చంద్రబాబు నాయుడుని ఎమ్మెల్యే నసీర్ కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని విభాగాలలోనూ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు నగరంలోని ఆటో నగర్ ప్రాంతం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రతి రోజూ సుమారు 30 వేల మంది కార్మికులు పని చేస్తుంటారని,, వందల సంఖ్యలో వ్యాపారులు ఉన్నారని వివరించారు. కనీస మౌలిక వస్తువులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ఈ నేపథ్యంలో ఆటోనగర్ ప్రాంత రూపురేఖలు మార్చేందుకు సహకారం అందించాలని విన్నవించారు. వీటితోపాటు నియోజకవర్గంలో వెనుకబడిన కాలనీలు చాలా ఉన్నాయని, ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నగర సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని వివరించారు.

## ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరిగితే ప్రజలు నేరుగా కమిషనర్ కి కాల్ చేయండి...

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10.**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలను, లే అవుట్లను ఉపేక్షించబోమని, ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరిగితే ప్రజలు నేరుగా కమిషనర్ పర్యవేక్షణలో ఉండే 98499 08391 నంబర్ కి వాట్సప్ ద్వారా తగిన ఆధారాలతో(ఫొటోలు, వీడియోలు) ఫిర్యాదు చేయవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో నిర్మాణాలు జిఎంసి నుండి నిర్దేశిత అనుమతులు పొందిన అనంతరమే చేపట్టాలని, అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తే నిర్మాణాన్ని కూల్చివేయడంతో పాటు నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే భాధ్యులైన సిబ్బంది, అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనధికార నిర్మాణాలు, లే అవుట్లపై ఫిర్యాదులు స్వీకరణకు ప్రత్యేకంగా కమిషనర్ చాంబర్లోని 98499 08391 నంబర్ ని కేటాయించామన్నారు. సదరు ఫిర్యాదులను నేరుగా తామే పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ నిర్మాణ, లే అవుట్ల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే నిర్దేశిత గడువులోపు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# సహజ విపత్తులపై అవగాహన కార్యక్రమం



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 10**

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్సి) ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు మరియు సహజ విపత్తులపై అవగాహన కార్యక్రమం భట్టిప్రోలు మండల పరిధిలోని పెసర్లంక,పెద్దలంక, గుంటూరు గూడెం లలో నిర్వహించినట్లు ఆ సంస్థ ఏరియా కోఆర్డినేటర్లు వి భగవాన్ దాస్, యన్ శ్రీ లత తెలిపారు. ఇటీవల లంక గ్రామాల చుట్టూ పొలాల్లో వరద నీరు వచ్చి చేరిన నేపథ్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరద నీరు వలన గ్రామాలలో అనారోగ్యాలు ప్రబలడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో ఇళ్ల చుట్టుప్రక్కల నీరు నిలవ లేకుండా చూసుకోవాలని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే కొద్ది రోజులపాటు తాగే అలవాటు చేసుకోవాలని ఇంటి లోపల బయట శుభ్రత పాటించాలని తెలిపారు. మానవుని జీవన విధానంలో మార్పుల వలన వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయని గతంలో ఋతువులను బట్టి ఉండే ఎండలు వానలు నేడు అందుకు భిన్నంగా ప్రతాపం చూపిస్తున్నవి అని తెలిపారు . ప్రకృతి విపత్తుల వలన ఉపాధి కోల్పోయి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఉంటాయని దానికి తగిన విధంగా ప్రణాళిక చేసుకొని జీవించాలని సూచించారు ఈ కార్యక్రమంలో డిబిఆర్సి ప్రతినిధులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటిన విజడం ఇంగ్లీష్ మీడియం స్కూల్



**బెల్లంకొండ అక్టోబర్ 10 పెన్ పవర్**

పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం పాపాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అండర్ 14, 17 ఆటల పోటీలలో నాగిరెడ్డి పాలెం గ్రామంలో ఉన్న విజడం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపించారు ఈ ఎంపికలకు మండలంలోని వివిధ స్కూల్స్ నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులలో విజిడం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యధికంగా ప్రతిభ చూపించారు అండర్ 17 విభాగంలో కోకో 9,కబడ్డీ 9,వాలీబాల్ 6,మంది అండర్ 14 విభాగంలో కబడ్డీ 7, వాలీబాల్ జట్టు కెప్టెన్ రాము నాయక్ ఆధ్వర్యంలో విజేతలుగా నిలవగా 100 మీటర్స్ లో జయపరావ్, లాంగ్ జంప్ లో అనిల్, షార్ట్ పుట్ లో వినయ చందు,లు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు సెలక్ట్ అయ్యారు వీరిని స్కూల్ ప్రిన్సిపాల్ పాండురంగారెడ్డి,వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు నాయక్ తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

# పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి



**వేటపాలెం, అక్టోబర్ 10 పెన్ పవర్**

వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని అనుమల్లిపేట గ్రామంలో పరిశుభ్రత సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. గ్రామ రహదారులపై గేదెలను కట్టేయడం, పేడకల్లను సకాలంలో తొలగించకపోవడం వలన గ్రామమంతా దుర్వాసన వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థుల సమాచారం ప్రకారం, గేదెల యజమానులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోలేదని, అనంతరం పంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినా స్పందన రాలేదని వాపోతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో డెంగ్యూ కేసులు కూడా నమోదవుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పరిశుభ్రత లోపం కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, గేదల యజమానులకు నోటీసులు జారీ చేసి, గ్రామంలోని రహదారులను శుభ్రపరచి దుర్వాసన తొలగించాలని కోరుతున్నారు.

**గ్రామస్థుల విన్నపం:** "మా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి, గేదల యజమానులు కూడా బాధ్యతగా వ్యవహరించాలి," అని గ్రామస్థులు పేర్కొన్నారు.

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

## - ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్, మచిలీపట్నం (పెన్ పవర్ ) అక్టోబర్ 10:**

పేద మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవాలని ఆలోచనతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాగిత. కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఎలక్ట్రానిక్ ఉత్సవ్ %ఇ% సూపర్ జివిస్టి సూపర్ సేవింగ్ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మధ్యతరగతి వర్గాల వారికి సూపర్ జివిస్టి వరం లాంటిదని ఆయన అన్నారు.తొలుత గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజా సమస్య లను అడిగి అక్కడి కక్కడే సమస్య లను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి మహమ్మద్ హమీదుల్ల ( గుజరాల్), మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్





ఖయుం, టీడీపీ అధ్యక్షుడు శ్యామలయ్య,మున్సిపల్ లింగం రెడ్డి. చంద్రశేఖర్ రెడ్డి, జీఎస్టీ అధికారి రంగామణి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ బెర్రీ పొగాకు సాగు పూర్తి నిషేధం: పోట్ల నరసింహారావు



**పెన్ పవర్ కారంపూడి అక్టోబర్ 10**

కారంపూడి మండలంలోని రైతులు బ్లాక్ బెర్రీ పొకాగు సాగు చేయవద్దని, ప్రభుత్వం వారు బ్లాక్ బెర్రీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించారని మండల వ్యవసాయ శాఖ అధికారి పోట్ల నరసింహారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 నుండి రాష్ట్రంలో బ్లాక్ బెర్రీ పొగాను నూరు శాతం నిషేధం చేయటానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. బ్లాక్ బెర్రీ పొగాకు నారును, నర్సరీలను నిషేదించటమైనదన్నారు. వైట్ బర్లీ పొగాకు సాగు చేసే రైతులు తప్పని సరిగా ఆయా సంస్థల నుండి అగ్రిమెంట్ బాండ్ ను పొందాల్సి ఉంటుందన్నారు. రబి సీజన్లోలో ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము లేదా చిరు ధాన్యాలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ వెంకటేష్ నాయక్, మండల అధికారులు, గ్రామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' పోస్టర్ల ఆవిష్కరణ

### ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ప్రారంభం



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 10**

చిలకలూరిపేట: నియోజకవర్గం లో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' పోస్టర్ల ఆవిష్కరణ!. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ప్రారంభించింది. ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడేందుకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి అప్పగించాలనే కుట్రలను అడ్డుకునేందుకు ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా జోరుగా కొనసాగనుంది. సంతకాల సేకరణలో మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు పాల్గొనాలి.ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రజల సొత్తు,వాటి ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం అని తెలిపారు.

# మురుగు నీరు, విష క్రిమి కీటకాలు, దోమలు,పాములు,చుట్టు పక్కల ఉన్న బావులలో కూడా నీరు కలుషితం...కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి టీచర్..

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 10**

8 వ డివిజన్ కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి టీచర్ ఆధ్వర్యంలో డివిజన్ లో వడ్డెర గూడెం, చంద్రయ్య నగర్,జెండా చెట్టు ఏరియా లలో ఉండే స్థానికులు ఎర్ర చెరువు నిండి పోయి తద్వారా మురుగు నీరు, విష క్రిమి కీటకాలు, దోమలు,పాములు,చుట్టు పక్కల ఉన్న బావులలో కూడా నీరు కలుషితం అవ్వటం పక్కనే ఉన్న సివిల్ సప్లై గూడెం, గ్యాస్ గూడెం లలో మురికి నీరు చేరి లోపల రాకపోకలు కూడా ఇబ్బంది గా ఉన్నట్లు వాటితో పాటు ఔట్ ఫ్లో కోసం ఒక డ్రైన్ ఏర్పాటు చేసి వాటిని శాశ్వత పరిష్కారం కొరకు జనసేన నాయకులు యిర్రి సాయి సమస్యని మేయర్ కి స్థానిక శాసనసభ్యులు కు తెలియచేయగా కమీషనర్ పులి శ్రీనివాస్ వచ్చి ఆయా ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కారం కొరకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో వాటిని వెంటనే చేయాలని అధికారులకు సూచించి. స్థానికులు కు త్వరలో పరిస్కరిస్తాము అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, ఫణి శర్మ,రబ్బానీ,కనకరావు, పెనుగొండ



భాస్కర్, నాగేశ్వరావు,ప్రసాద్, షేక్ అజీస్,తేజ ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్ విభాగం తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి చర్ల ,సూరవారిపల్లె గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో ,డిప్యూటీ ఎంపీడీవో

### సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చిన అధికారులు.





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 10**

కొమరోలు మండలంలోని సూరవారిపల్లె ,రెడ్డిచర్ల లో గల గ్రామ సచివాలయాలను శుక్రవారం కొమరోలు ఎంపీడీవో సానికొమ్ము సత్యం ,డిప్యూటీ ఎంపీడీవో జె సి హెచ్ చెన్నారావు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా అధికారులు గ్రామ సచివాలయాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు .సిబ్బంది సమయపాలన పాటించాలని ,తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అంకితభావంతో పనిచేయాలని, గ్రామ సచివాలయాలకు వివిధ అవసరాల నిమిత్తం వస్తున్న ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం లో మాట్లాడుతూ వారి సమస్యలను ఓపిక విని వాటి పరిష్కారాన్ని కృషి చేయాలని కోరారు. సమయపాలన పాటించని సిబ్బందిపై, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు .గ్రామ సచివాలయాల కార్యదర్శులు సచివాలయ నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా కృషి చేయాలని కోరారు. ఆ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన వివరాలు

### రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**బల్లికురవ పెన్ పవర్ అక్టోబర్ 10**

నేడు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్(బుజ్జి) అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పర్యటించనున్నారని క్యాంపు కార్యాలయం ద్వారా ఓ ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజవర్గ పరిధిలోని జై పంగులూరు మండలం కొండ మంజులూరు గ్రామం నందు ఉదయం 10:00గం!లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిల్స్ పంపిణీ మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేదురు అనంతరం బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామం నందు ఉదయం 11:30 గం!లకు పలు కార్యక్రమాల్లో పాల్గొనేదరు అనంతరం సంతమాగులూరు మండలం అడవి పాలెం గ్రామం నందు మధ్యాహ్నం 1:00గం!లకు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేదరు అని తెలిపారు. కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొని పలు కార్యక్రమాలు జయప్రద చేయాలని గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు.

# బాల్యవివాహాలపై అప్రమత్తం కావాలి

### ఐసిడీఎస్ సూపర్వైజర్ పుష్పవల్లి

**వేటపాలెం,పెన్ పవర్, అక్టోబర్ 11**

అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా వేటపాలెం జడ్పీ గర్ల్స్ హై స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడీఎస్ సూపర్వైజర్ సజ్జా పుష్పవల్లి బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆమె మాట్లాడుతూ, "బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే పోలీసులకు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి. లేదంటే, సంబంధిత కళాశాలలు లేదా హై స్కూల్స్ లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్ ద్వారా కూడా సమాచారాన్ని అందించవచ్చు," అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివజ్యోతి (సూపర్వైజర్), పద్మజ (మహిళా పోలీస్), అంబికా సువర్ణ, కరుణ తదితరులు పాల్గొన్నారు. విజయవంతంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలులో విజేతలకు బహుమతులను అందజేశారు.



# తలనొప్పిగా మారుతున్న తమ్ముళ్ల తన్నులాటలు

**అనంతపురం, అక్టోబరు 10, పెన్ పవర్:** ఉమ్మడి అనంతపురం జిల్లా లోని కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ అయినప్పటికీ నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ధర్మవరం , రాప్తాడు వంటి నియోజకవర్గాల్లో పార్టీ లోపలకే సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే ఇప్పటివరకు వీరి మధ్య అనుకున్నంత పెద్దగా సవాళ్లు కనిపించవు.తాజాగా రాయదుర్గం నియోజకవర్గంలో కాల్వ శ్రీనివాసులు పై పార్టీలోపల విమర్శలు వినిపించాయి. శ్రీనివాసులు సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్నారు. తన రాజకీయ చరిత్రలో సౌమ్యుడనే పేరు తెచ్చుకున్నాడు, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగాగుర్తింపు పొందారు. తన సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా, అన్ని వర్గాల వారిని కలుపుతూ ముందుకు వెళ్తూ అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.కానీ, ఇటీవల ఆయనపై సొంత పార్టీలో కొన్నివిమర్శలు వచ్చాయి. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పాత ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అధికారపక్షం లోపలే విభేదాలు పెరుగుతున్నాయి.. ఇది స్థానిక రాజకీయ వాతావరణంలో టిడిపినాయకులకు సవాలు గా మారింది. ఇక ఈ లక్షలు మరీ ఎక్కువ కావడంతో లోకల్ గా కూడా "ఎంతకాలం ఈ గొడవలు?" అనే విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో టిడిపి అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు కాస్త తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా కేవలం దూకుడే ఫలితాన్ని ఇవ్వదు. స్థానిక పరిస్థితులు, ప్రజల ఆలోచనలు, సమాజ మార్పులను అర్థంచేసుకుని నాయకులు సరైన వ్యూహాలను రూపొందించుకోవాలి. అలా కాకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.ఇక చంద్రబాబు నాయుడు ఈ సమస్యపైపెద్దగా దృష్టి పెట్టకపోవడం కూడా వార్తల్లో వినిపిస్తోంది. కానీ, స్థానిక రాజకీయ దృష్ట్యా ఇది సరైన పరిణామం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలను సమర్థవంతంగాసర్దుమణిగే విధంగా ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, స్థానిక స్థాయిలో సమైక్యత సాధించడానికి చర్యలు అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.మొత్తానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోనినియోజకవర్గాల్లో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, సవాళ్లను సానుకూలంగా పరిష్కరించే ప్రయత్నాలు ఇప్పటి వరకు లేకపోవడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.టిడిపి నాయకులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలి అని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# పవన్ నోట నిరాశజనకంగా మాటలు




**కాకినాడ, అక్టోబరు 10, పెన్ పవర్:** కొద్దీ రోజుల క్రితం ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం లోని ఉప్పాడ ప్రాంతంలో మత్స్యకారులు సముద్రపు నీరు ఫ్యాక్టరీల కారణంగా కలుషితం అవుతున్నాయని, చేపలు విషపూరితంగా మారిపోతున్నాయని, దీనిపై స్పష్టమైన విచారణ చేపట్టి, చర్యలు తీసుకోకపోతే మేము అసలు చేపలు పట్టడానికే వెళ్ళమని, పవన్ కళ్యాణ్ వచ్చి మాట్లాడాలి అంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపిన వీడియోలను మనమంతా చూసాము. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ వెంటనే సమీక్ష నిర్వహించి, నేడు కాకినాడ జిల్లాలో పర్యటించి, ఉప్పాడ లో బహిరంగ సభని ఏర్పాటు చేసి అక్కడి మత్స్యకారులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన వాగ్దానాలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ మాట ఇచ్చాడంటే, చేసి తీరుతాడు అంతే అంటూ ఈ వీడియోలను చూసిన ప్రతీ ఒక్కరు కామెంట్స్ చేస్తున్నారు.ఆయన మాట్లాడుతూ 'ఈరోజు ఉదయం కాకినాడ కలెక్టర్ గారితో ఈ సమస్య గురించి మాట్లాడాను. దాదాపుగా వంద మంది యువకుల నుండి ఏమి జరుగుతుందో తెలుసుకున్నాను. ఇది ఒక్క రోజులో తీరిపోయే సమస్య కాదు, కాబట్టి నాకు ఒక మూడు నెలలు సమయం ఇవ్వండి. దీని పరిష్కార మార్గం వెతుకుతాను, ఒక చక్కటి రూట్ మ్యాప్ తో మీ ముందుకొస్తాను, ఈ విషయం పై క్యాబినెట్ లో చర్చించడమే కాదు, అవసరమైతే అసెంబ్లీ లో కూడా చర్చిస్తాను. కాస్త సమయం ఇవ్వండి' అంటూ చెప్పుకొచ్చాడు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఉప్పాడ సముద్ర తీరం చుట్టూ రేటెన్షన్ వాల్ కట్టించడానికి కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాకపోతే ఈ వాల్ కోసం 350 కోట్ల రూపాయిలు కేంద్రం నుండి విడుదల అవ్వాలి. ఇప్పటికే రెండు సార్లు దీనిపై చర్చించారు, రేపు మూడవసారి చర్చించబోతున్నారు'.'కేంద్రంఆమోదం అయితే తెలిపింది కానీ, 250 కోట్లు ఇవ్వాలా?, లేకపోతే 350 కోట్లు ఇవ్వాల్సిందేనా అనే విషయం పై మాత్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నేను మన సాధక బాధకాలు మొత్తం చెప్పి, 350 కోట్ల రూపాయిలుఇవ్వాలని రిక్వెస్ట్ చేసాను. అతి త్వరలోనే నిధులు విడుదల కాబోతున్నాయి. నేను మిగిలిన రాజకీయ నాయకులూ లాగా రెండు మూడు రోజుల్లో అయిపోతుందని మిమ్మల్ని మభ్యపెట్టే వ్యక్తిని కాదు. ప్రతీ దానికి ఒకనిర్దిష్టమైన సమయం ఉంటుంది. సమయానుసారం అన్ని పనులు చకచకా జరిగిపోతాయి. అవసరమైతే రాజకీయాల నుండి తప్పుకుంటాను కానీ, మిమ్మల్ని నిర్లక్ష్యం చేసే ప్రసక్తే లేదు' అంటూ పవన్ కళ్యాణ్చెప్పుకొచ్చాడు. పవన్ వచ్చి మాట ఇవ్వడం తో ఇన్ని రోజులు నిరసన తెలిపిన మత్స్యకారులు ఇప్పుడు శాంతించారు. చూడాలి మరి రాబోయే రోజుల్లో ఈ పనులు ఎంత వరకు ప్రోగ్రెస్ అవుతాయి అనేది.

# చెట్టుకు ఢీకొట్టిన కారు ఏడుగురికి తీవ్ర గాయాలు

**జగిత్యాల:పెన్ పవర్:** కోరుట్ల, మెట్పల్లి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా వుంది. గురువారంరాత్రి కోరుట్ల పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు, కోరుట్ల నుండి మారుతీ నగర్ దాబా దగ్గర చాయ్ తాగడానికి వెళ్లడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది.. క్షతగాత్రులను జగిత్యాల్, కరీంనగర్ ఆసుపత్రి లకుతరలించారు.



# సంక్రాంతి నాటికి డీఎస్సీ...




**విజయవాడ, అక్టోబరు 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో గుడ్ న్యూస్ చెప్పారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించినఆయన డీఎస్సీ జనవరిలో నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా డీఎస్సీ, టెట్ ఉంటాయని పునరుద్ఘాటించారు. ప్రతిఏటా డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన హామీకి కట్టుబడిఉన్నామని మంత్రి నారా లోకేష్ మరోసారి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో టెట్, 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ నిర్వహించి, టీచర్ పోస్టులను భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టెట్, డిఎస్సీలకు అభ్యర్థులంతా సన్నద్ధం కావాలి సూచించారు. కొత్త డిఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళికఅమలు చేస్తామన్నారు లోకేష్. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ, స్పెషల్ డిఎస్సీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్యసాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. బేస్ లైన్ టెస్ట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 78మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యాప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్ పర్యటనకుపంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికే ఈ ఏడాది ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 20న 16వేలకుపైగా పోస్టులతో తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే డీఎస్సీ నియామక నోటిఫికేషన్విడుదలకు సంబంధించి సంతకం చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించుకొని ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్‌లో వచ్చిన నోటిఫికేషన్‌కు జూన్‌లో పరీక్షలు పెట్టారు. నెల రోజులపాటు పరీక్షలు నిర్వహించారు. అక్కడికి నెల రోజుల తర్వాత ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అమరావతిలో వేడుకగా కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలను కూడా అందజేశారు. ఆ టైంలోనే ఏటా డీఎస్సీ ఉంటుందని నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ వేస్తున్నామని మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నట్టుగానే అందుకు తగ్గ కార్యచరణ చేపట్టాలనిఅధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. మొన్న నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులు, ఇంకా వివిధ పాఠశాలల్లో ఉన్న ఖాళీల గుర్తించాల్సి ఉంది. ఈసారి భారీ స్థాయిలో పోస్టులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.భారీగా పోలీసుల నియామకాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందించే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లుతెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్‌పీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో.. ఉన్నఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసు విభాగంలో ఖాళీల వివరాలకు సంబంధించిన లేఖను ఇప్పటికే డీజీపీ.. ప్రభుత్వానికి పంపించారు. ఆ వివరాలు పరిశీలించిన తర్వాతప్రభుత్వం అనుమతి ఇస్తే.. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర ప్రభుత్వానికి డీజీపీ కార్యాలయం పంపించిన లేఖలో ఖాళీల వివరాలను ప్రస్తావించింది. ఈ ఏడాదృి ఆగస్టు 31వ తేదీవరకు ఉన్న ఖాళీలని అందులో వెల్లడించారు. దాని ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో.. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్లపోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ పోస్టుల నియామకాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యేఅవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని ప్రభుత్వానికి రాసిన లేఖలో డీజీపీ పేర్కొన్నారు. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో నేరాలు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టం చేయాలంటే..పోలీస్ ఫోర్స్ అవసరమని అన్నారు. అందుకోసం ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నిరుద్యోగుల గరిష్ఠవయోపరిమితి పెంచింది. న్-యూనిఫాం సర్వీస్‌ల్లో పోస్టులకు.. గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం.. ఇప్పుడు 42 ఏళ్ల వరకు కూడా ఈఉద్యోగాలకు అప్లై
చేసుకోవచ్చు.యూనిఫాం పోస్టులకు రెండేళ్లు వయోపరిమితి పెంచింది. ఈ సడలింపు వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు వర్తించనున్నట్లు తెలిపింది. ఏపీపీఎస్సీ, ఇతర నియామక సంస్థల ద్వారా జరిగేనియామకాలకు ఇది వర్తిస్తుందని సర్కార్ పేర్కొంది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. అందులో ముఖ్యంగా, వయసు కారణంగాఉగ్యోగాలు అనర్హులుగా ఉన్నవారు.. ఈ వయోపరిమితి పెంపుతో మళ్లీ దరఖాస్తు చేసుకో వచ్చు. అలాంటి వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని చెప్పాలి.

# నవంబర్ నుంచి బంగారం తవ్వకాలు..

**కర్నూలు, అక్టోబరు 10, పెన్ పవర్:** రాయి రాయి అన్నది ఒకనాటికి రత్నమవునురా. బంగారం లాంటి ఈ మాట ఇప్పుడు రాయలసీమలో బంగారం ఉత్పత్తికి బాటలేసింది. ఇన్నాళ్లు నెర్రలు బాసిన నేలలో ఇప్పుడు ఇక కనకధారే. అవును.. కరువుకుకేరాఫ్‌గా నిలిచిన కర్నూలు సీమ ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు సిరుల సిగ కాబోతోంది. కర్నాటక గోల్డ్ ఫీల్డ్‌ను మించి తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌లో భారీ మైనింగ్‌కు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటి అతిపెద్ద ప్రవేటు గోల్డ్ మైన్‌గా కర్నూలు రికార్డు క్రియేట్ చేయబోతుంది. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో గోల్డ్ మైనింగ్ ప్రారంభిస్తున్నట్టు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ప్రకటించింది. పసిడి ధరలు రికార్డు స్థాయిలో ఆకాశన్నంటుతున్న వేళ డెఫినెట్‌గా ఇది బంగారంలాంటి మాటే. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు దేశంలో అతిపెద్ద ఫస్ట్ ప్రయివేటు గోల్డ్ మైన్ ఇదే.వానొస్తే కర్నూలు జిల్లాతుగ్గలి, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి సహా చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలవేట జోరుగా సాగేది. అంతేకాదు నెర్రలు బాసిన ఈ నేలలో బంగారు నిక్షేపాలున్నాయని పరిశోధనల్లో తేలింది. అలా తుగ్గలి మండలంబొల్లవానిపల్లి గ్రామం దగ్గర జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. బంగారం, వెండి వంటి ఖనిజాల వెలికితీతలో ఎంతో అనుభవం వున్న త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్‌లాడ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, దక్కన్ గోల్డ్ మైన్స్ భాగస్వామ్యంతో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ రాయలసీమలో సువర్ణ శకానికి తెరలేచింది.జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్ 70 శాతంతో ప్రధాన వాటాదారులైన త్రివేణి సంస్థ ఎండీ ప్రభాకరన్ %ా% జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో మైనింగ్ చేపడుతామని ప్రకటించారు. ఏడాదికి 500 కేజీల ఉత్పత్తి లక్ష్యంగా త్వరలో పనులుప్రారంభిస్తామన్నారు. ఏటా టన్ను బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్దంచేసినట్టు చెప్పారాయన. భవిష్యత్తులో ఇక్కడ బంగారం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కొత్తగా నిర్మించిన ప్లాంట్‌లోట్రయల్ రన్ కొనసాగుతుందన్నారు. భారత్ ఆత్మనిర్భర్ సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ బాసటగా నిలుస్తుందన్నారు. బంగారం ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతగా పరిసర గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికితామ ప్రాజెక్ట్ చేయూతనిస్తుందన్నారు ప్రభాకరన్. భూములిచ్చిన రైతు కుటుంబాలకు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

# బీజేపీలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ





**తిరుపతి, అక్టోబరు 10,పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కుటుంబం గుడ్ బై చెబుతుందా? కమలం గూటికి చేరుతుందా? బిజెపిలో చేరాల్సిన అనివార్య పరిస్థితి ఎదురయిందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇప్పుడు దీని పైనే చర్చ నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబం ఇప్పుడు కేసుల్లో చిక్కుకుంది. వాటి నుంచి బయటపడాలంటే అధికార పార్టీలోకి వెళ్లడం ఒక్కటే మార్గం. ఆపై సొంత పార్టీ అధినేత నుంచి ఆశించిన స్థాయిలోసహకారం లభించకపోవడంతో.. ఆ కుటుంబం బిజెపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఇంతకీ ఆ ఫ్యామిలీ ఏదంటే పెద్దిరెడ్డి. ఇటీవల పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైలు నుంచి బయటకు వచ్చారు. అయితే అదే మిధున్ రెడ్డిని ఇప్పుడు కేంద్రం ఐక్యరాజ్యసమితి సమావేశాలకు పంపిస్తుండడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.కూటమి( అధికారంలోకి వచ్చి 15 నెలలుఅవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూకుడుగా వ్యవహరించిన నేతలకు కేసుల ఇబ్బందులు తప్పడం లేదు. చివరకు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలను చేసిన వారిని సైతం విడిచిపెట్టలేదు. ఈపరిస్థితుల్లో రాయలసీమను తన ఆధీనంలో ఉంచుకొని పాలించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయనపై రకరకాల కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు మద్యం కుంభకోణం కేసులోపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు.. మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రెండు నెలల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఇటీవల ఆయనకు బెయిల్ లభించింది.అయితే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిజైల్లో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శించలేదు. బెయిల్ పై బయటకు వచ్చిన మిధున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ఇష్టపడలేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వైసిపిఓటమిపై పోస్టుమార్టం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కానీ.. పెద్దిరెడ్డి కుటుంబం ఎలా గెలిచింది అన్నదానిపై జగన్మోహన్ రెడ్డి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆసమయంలోనే టిడిపి తో పెద్దిరెడ్డి కుమ్మక్కయ్యారా? అన్న అనుమానాలు కూడా బయటపడ్డాయి. అటు తరువాత ఆ వివాదం ముగిసింది. అయితే అసెంబ్లీకి వైసిపి ఎమ్మెల్యేల హాజరు విషయంలో పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి లీడ్ తీసుకోవాలని జగన్ సూచించారు. అందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పుకోలేదు. అప్పటినుంచి జగన్లో అనుమానాలు మరింత పెరిగాయి అన్న ప్రచారం సాగుతోంది.ఐక్యరాజ్యసమితి సమావేశాలకుబిజెపి ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులను ఎంపిక చేశారు. అయితే ఏపీ నుంచి ఆ బృందంలో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కూడా ఉన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నుంచిఅభ్యంతరాలు వచ్చినా బిజెపి పెద్దలు మాత్రం మిధున్ రెడ్డిని ఎంపిక చేశారు. దీంతో పెద్దిరెడ్డి కుటుంబం బిజెపికి దగ్గర అయిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో పెద్దిరెడ్డి వైసీపీకి గుడ్ బైచెప్పరని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తుంటే మాత్రం పెద్దిరెడ్డి కుటుంబం కమలం గూటికి వెళ్లడం ఖాయం అని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడా

# ఐపీఎల్ మినీ వేలానికి డేట్ ఫిక్స్.. ఈసారి ఇండియాలోనే!

## డిసెంబర్ 14న ఐపీఎల్ 19వ సీజన్ మినీ వేలం

## రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత్‌లోనే నిర్వహణ

## వేలం వేదిక రేసులో ముంబై, బెంగళూరు నగరాలు

## నవంబర్ 15లోగా రిటెన్షన్ ఆటగాళ్ల జాబితా ఇవ్వాలి

## అశ్విన్ రిటైర్మెంట్‌తో చెన్నై పర్సు బలోపేతం

## కెప్టెన్ సంజూ శాంసన్‌పై రాజస్థాన్ కీలక నిర్ణయం?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మినీ వేలానికి రంగం సిద్ధమవుతోంది. 19వ ఎడిషన్ కోసం ఆటగాళ్ల వేలం ప్రక్రియ డిసెంబర్ 14న జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే డిసెంబర్ 13న కూడా నిర్వహించేందుకు వీలుగా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మేరకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ వర్గాలు ఫ్రాంచైజీలకు ప్రాథమిక సమాచారం అందించినట్లు వార్తలు వస్తున్నాయి.

గత రెండు సీజన్లుగా విదేశాల్లో జరుగుతున్న వేలంపాట, ఈసారి మళ్లీ స్వదేశానికి తిరిగి రానుంది. గతంలో దుబాయ్, జెడ్డాలలో వేలం నిర్వహించగా, ఈసారి భారత్‌లోనే జరపాలని నిర్వాహకులు భావిస్తున్నారు. వేలానికి ఆతిథ్యం ఇచ్చే నగరాల జాబితాలో ముంబై, బెంగళూరు ముందువరుసలో ఉన్నాయి. ఆటగాళ్ల రిటెన్షన్‌కు సంబంధించి ఫ్రాంచైజీలు తమ తుది జాబితాను నవంబర్ 15లోగా సమర్పించాల్సి ఉంటుంది.

గత సీజన్‌లో ఫాఫ్ డుప్లెసిస్‌ను వదులుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రజత్ పాటిదార్ కెప్టెన్సీలో తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ, తమ జట్టును మరింత పటిష్టం చేసుకునేందుకు ఈ వేలంపై దృష్టి సారించనుంది.మరోవైపు, గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లకు ఈ వేలం కీలకంగా మారింది. వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలకడంతో చెన్నై పర్సులో భారీగా డబ్బు చేరనుంది. దీంతో కొత్త ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు సీఎస్‌కేకు మంచి అవకాశం లభించింది. ఇక రాజస్థాన్ రాయల్స్ తమ కెప్టెన్ సంజూ శాంసన్‌ను ట్రేడింగ్ ద్వారా మరో జట్టుకు పంపే ఆలోచనలో ఉన్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తిని రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ జట్టు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# చరిత్ర సృష్టించిన జైశ్వాల్.. 148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే రెండో ప్లేయర్‌గా అరుదైన ఘనత




**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ వేదికగా వెస్టిండీస్?తో జరుగుతోన్న రెండో టెస్టులో భారీ సెంచరీ (173)తో కదం తొక్కిన స్టార్ క్రికెటర్ యశస్వీ జైశ్వాల్ అరుదైన ఘనత సాధించాడు. అతిచిన్న వయస్సు (23 ఏళ్లు)లోనే టెస్ట్ ఫార్మాట్?లో అత్యధిక (5) సార్లు 150 ప్లస్ స్కోర్లు సాధించిన రెండో ఆటగాడిగా రికార్డ్ సృష్టించాడు. జైశ్వాల్ 23 ఏళ్ల వయసులో 5 సార్లు 150 ప్లస్ స్కోర్ చేశాడు. జైశ్వాల్ కంటే ముందు ఈ రికార్డ్ ఆసీస్ దిగ్గజం సర్ బ్రాడ్ మాన్ పేరిట ఉంది. బ్రాడ్ మాన్ 23 ఏళ్ల వయసులో 8 సార్లు 150 ప్లస్ స్కోర్ చేసి ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈయన తర్వాత 5 సార్లు 150 స్కోర్ చేసి జైశ్వాల్ రెండో స్థానంలో ఉన్నాడు. తద్వారా148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో డాన్ బ్రాడ్‌మాన్ మాత్రమే సాధించిన ఘనతను యశస్వి జైస్వాల్ సాధించడం ద్వారా పుస్తకాలలో తన పేరును లిఖించుకున్నాడు. కాగా, టీమిండియా, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న రెండో టెస్ట్?లో యశస్వి జైశ్వాల్ సెంచరీతో అదరగొట్టాడు. 253 బంతుల్లో 173 పరుగులు చేసి ద్విశతకానికి చేరువలో ఉన్నాడు. 22 ఫోర్లతో విండీస్ బౌలర్లపై జైశ్వాల్ విరుచుకుపడ్డాడు. జైశ్వాల్ టెస్ట్ క్రికెట్ కెరీర్?లో ఇది ఏడో సెంచరీ కావడం విశేషం. ఇందులో 5 సెంచరీలు 150 ప్లస్ స్కోర్ కావడం మరో హైలైట్. ఇక.. జైశ్వాల్ చెలరేగడంతో వెస్టిండీస్ తో జరుగుతోన్న రెండో టెస్టుల్లో టీమిండియా భారీ స్కోర్ దిశగా దూసుకుపోతుంది. తొ లి రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 318 పరుగుల భారీ స్కోర్ చేసింది టీమిండియా. ప్రస్తుతం క్రీజులో యశస్వీ జైశ్వాల్ (173), కెప్టెన్ శుభమన్ గిల్ (20) ఉన్నారు. చేతిలో మరో 8 వికెట్లు ఉండటంతో ఫస్ట్ ఇన్నింగ్స్?లో టీమిండియా భారీ స్కోర్ చేసేలా కనిపిస్తోంది.

23 ఏళ్ల వయసులో అత్యధికంగా 150ం నాక్‌లు చేసిన ఆటగాళ్ళు
డాన్ బ్రాడ్‌మాన్ 8 సార్లు
యశస్వి జైస్వాల్ 5 సార్లు
జావేద్ మియానంద్ 4 సార్లు. గ్రేమ్ స్మిత్ 4 సార్లు
సచిన్ టెండూల్కర్ 4 సార్లు

# కాస్ట్లీ కారు కొన్న అభిషేక్ శర్మ.. ధర ఎంతో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2025 హీరో, టీమిండియా యంగ్ సెన్సేషన్ అభిషేక్ శర్మ కారు కొన్నాడు. కారు అంటే మాములు కారు కాదు వెరీ కాస్ట్లీ కారు. ఫెరారీ స్పోర్ట్స్ కారు కొనుగోలు చేశాడు అభిషేక్. ఈ విషయాన్ని అతడే స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో కొత్త కారు మూడు ఫొటోలను పోస్ట్ చేసి దానికి '%ఎ%12' అని క్యాప్షన్ ఇచ్చాడు.

ఇది చూసిన నెటిజన్లు అభిషేక్?కు కంగ్రాట్స్ చెబుతున్నారు. కాస్ట్లీ కారులో అభిషేక్ కాస్ట్లీ లుక్ అదిరిపోయిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు ఏమో అభిషేక్ కొన్న కారు వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ కారు ధర ఎంత..? మోడల్ ఏంటి..? కలర్ ఏంటి..? అనే విషయాలు ఆరా తీస్తున్నారు. అయితే.. అభిషేక్ కొన్న కారు ఫెరారీ %ఎ%12 మోడల్. కారు కలర్ బ్లాక్. ఈ కారు ధర దాదాపు రూ.5.2 కోట్లు.కాగా, 2025 ఆసియా కప్ విజేతగా టీమిండియా నిలిచిన విషయం తెలిసిందే. భారత్ ఆసియా కప్ గెలవడంలో ఓపెనర్ అభిషేక్ శర్మదే కీలక పాత్ర. టోర్నీ మొత్తం అద్భుతంగా ఆడి ఇండియాను విజేతగా నిలిపాడు. ఏడు ఇన్నింగ్స్‌లలో 44.86 సగటు, 200 స్ట్రైక్ రేట్‌తో 314 పరుగుల చేసి టోర్నీ టాప్ స్కోరర్?గా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డ్ దక్కించుకున్నాడు. ఆసియా కప్?లో అభిషేక్ బ్యాట్?తో పరుగుల వరద పారించడంతో సెప్టెంబర్ మంత్ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యాడు.

# సమ్మర్ లో పవన్, చరణ్, చిరు.. 1000 కోట్లు?

టాలీవుడ్ మెగా ఫ్యామిలీకి చెందిన హీరోలంతా ఇప్పుడు తమ అప్ కమింగ్ మూవీస్ తో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. వారిలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. రీసెంట్ గా ఓజీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మిగతా ఆడియన్స్ కు కంప్లీట్ గా సాటిస్ఫై చేయలేకపోయినా.. ఫ్యాన్స్ కు మాత్రం సినిమా ఓ రేంజ్ లో నచ్చేసింది .సింపుల్ గా చెప్పాలంటే పండుగ చేసుకున్నారు. అయితే పవన్ చేతిలో ఉన్న మరో సినిమా ఉస్తాద్ భగత్ సింగ్ మూవీతో వచ్చే ఏడాది





ప్రేక్షకుల ముందుకు రానున్నారు. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీ షూటింగ్ ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. పవన్ చిత్రీకరణ పార్ట్ కంప్లీట్ అవ్వగా.. 2026 సమ్మర్ లో రిలీజ్ కానుంది.అయితే పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ తో రానుండగా.. మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. విశ్వంభర, పెద్ది సినిమాలతో సందడి చేయనున్నారు విశ్వంభర మూవీ సమ్మర్ లో రిలీజ్ అవ్వనుందని ఇటీవల చిరు ప్రకటించగా.. చరణ్ పెద్ది సినిమా మార్చి 27వ తేదీన గ్రాండ్ గా విడుదల కానున్నట్లు ఆ మూవీ మేకర్స్ అనౌన్స్ చేశారు.అలా పవన్, చిరు, చరణ్.. ముగ్గురూ కూడా సమ్మర్ లో సందడి చేయనున్నారు. అయితే ఉస్తాద్ భగత్ సింగ్ మూవీకి రూ.150 కోట్ల బిజినెస్ జరిగే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. సినిమా టాక్ బాగుంటే ఇంకా హైప్ క్రియేట్ అయితే కలెక్షన్స్ లెక్క రూ.200 కోట్లకు చేరవచ్చని అంటున్నారు. విశ్వంభర కూడా అదే రేంజ్ టార్గెట్ తో ఉందని తెలుస్తోంది.అదే సమయంలో పెద్ది మూవీకి రూ.350 కోట్లకు పైగా బిజినెస్ జరగనున్నట్లు సమాచారం. కానీ ఆ మూవీ మేకర్స్ మాత్రం బాక్సాఫీస్ వద్ద టార్గెట్ ను 600 కోట్లకు పైనే పెట్టుకున్నారని టాక్ వినిపిస్తోంది. ఏదేమైనా మూడు సినిమాలు కలిపి భారీగా బిజినెస్ చేయనున్నాయి.. ముగ్గురు మెగా హీరోలు కలిసి సమ్మర్ లో రూ.1000 కోట్ల బిజినెస్ చేయనున్నారన్నమాట. ఇప్పటికే మూడు చిత్రాలపై కూడా ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. పవన్, చిరు, చరణ్ భారీ హిట్స్ అందుకుంటారని ఆశిస్తున్నారు. కాబట్టి మౌత్ టాక్ పాజిటివ్ గా ఉంటే తిరుగులేదు. బిజినెస్ కు మించిన వసూళ్లను కలెక్ట్ చేయడం మాత్రం పక్కా.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com